విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

శుక్రవారం 14 మార్చి 2025 8 పేజీలు

ప్రమాదాలకు నిలయంగా
జాతీయ రహదారులు

నిర్మాణం వెంటనే చేపట్టాలి : సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్

విశాలాంధ్ర-ఏ కొండూరు: నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే ఇబ్రహీంపట్నం-జగదల్పూర్ జాతీయ రహదారి 30 ప్రమాదాలకు నిలయంగా మారిందని, నేషనల్ హైవే అథారిటీ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మండిపడ్డారు. జిల్లాలోని ఏ కొండూరు మండలం రామచంద్రపురం గ్రామం వద్ద గత దశాబ్ద కాలం నుండి రోడ్డు నిర్మాణం లేక గ్రామస్తులు వాహనదారులు అవస్థలు చూసి సీపీఐ నాయకులు రోడ్డు నిర్మాణం చేయాలని గురువారం పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా దోనెపూడి శంకర్ పాల్గొని మాట్లాడుతూ రామచంద్రపురం గ్రామంలో మిగతా 2 లో ...

నాటు సారాపై డ్రోన్లతో నిఘా

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో నాటు సారా తయారీపై నిఘా కోసం డ్రోన్లు వినియోగించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. నాటు సారా తయారీ, రవాణా, వినియోగాన్ని సంపూర్ణంగా నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు.స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మిగతా 2 లో ...

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సా॥ : 6:22
సహెరి : శనివారం ఉ॥ 4:58

పెండింగ్ కేసులు తగ్గించాలి

బాధితులతో మర్యాదగా వివరించాలి : ఎస్పీ

విశాలాంధ్ర-నరసరావుపేట: పోలీస్ స్టేషన్‌లను ఆశ్రయించే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, సున్నితమైన భాషతో మాట్లాడాలని, వారితో మమేకమై సమస్యలను ఓపికగా విని న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించాలని, పెండింగ్ కేసులను త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లాలోని పోలీస్ అధికారులకు ఎస్పీ కే శ్రీనివాసరావు సూచించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం ఎస్పీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, వారికి సంబంధించిన కేసుల విచారణ సమయంలో తప్పనిసరిగా మహిళా పోలీస్ అధికారి గాని, సిబ్బంది గాని ఉండేటట్లుగా చూసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలోగా చర్యలు చేపట్టి, పోర్టల్ లో డాక్యుమెంట్లను అప్లోడ్ చేయాలన్నారు. పోక్సో కేసులు, మహిళల పై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ కేసులు, మిగతా 2 లో ...

మొల్లమాంబ తెలుగు సాహిత్య సేవలో చిరస్మరణీయం

కలెక్టర్ డా.జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : రామాయణాన్ని సంస్క ృతం నుండి అందరికి అర్థమయ్యేలా తెలుగుభాషలోకి అనుమదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ(మొల్ల) అందించిన సాహిత్య సేవలు, చిరస్మరణీయమని, మొల్ల జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు. తెలుగు కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మొల్ల జయంతి వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిదిగా హాజరై ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రచయిత్రి మొల్ల చిరుప్రాయంలోనే శ్రీరామ చరిత్రను వచన కావ్యంగా రచించారన్నారు. మొల్ల చురుకుదనం, ప్రజ్ఞను గమనించిన రాయలువారు ఆమెను సత్కరించి ప్రోత్సహించారన్నారు. శ్రీకంఠేశ్వరుని దేవాలయంలో ఐదు రోజుల పాటు రేయింబవళ్లు మల్లమ్మ పద్య రామాయణంను మూడు ప్రతులుగా పూర్తి చేయడం జరిగిందన్నారు. మొదటి రామాయణ ప్రతి హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చేరిందని అప్పటి విద్యాశాఖ మిగతా 2 లో ...

16న సీపీఐ శతవార్షికోత్సవాలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: అమర జీవుల శత వార్షికోత్సవంలో భాగంగా పెదకూరపాడులో ఈనెల 16వ తేదీన వర్ధంతి సభను నిర్వహించనున్నట్లు సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, సీపీఐ కార్యవర్గ సభ్యులు కొమ్మాలపాటి శరత్ జ్యోతి, సీపీఐ పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావులతో కలసి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పెద్దకూరపాడు శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు యోధులు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సాధకులు, పాఠశాల నిర్మాణ సారథి, మాజీ శాసనసభ సభ్యులు మాజీ సర్పంచ్ కామ్రేడ్ దర్శి లక్ష్మయ్య, కమ్యూనిస్టు పార్టీ నాయకులు కామ్రేడ్ దర్శి పానకాలరావు, తెలంగాణా సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ అంబటి హనుమంతరావు పెదకూరపాడు నియోజవర్గంలో భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి బడుగు బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా స్మారక స్థూపాలకు మరమ్మతులు చేసి రంగులు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొననున్నారని వెల్లడించారు.

యథేచ్ఛగా కోడి పందేలు !

పట్టించుకోని అధికారులు

నెల వారీ మామూళ్లతో తూతూ మంత్రంగా దాడులు

పందేల రాయుళ్లకు వత్తాసు పలుకుతున్న రాజకీయ నేతలు

విశాలాంధ్ర-విజయవాడ క్రైమ్ : ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్‌లో కోడి పందేలు యథేచ్ఛగా సాగుతున్నాయి. విజయవాడ నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట పందేలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ పందేలకు విజయవాడ నగరం నుంచే కాకుండా గ్రామీణ ప్రాంతాలతోపాటు పొరుగున ఉన్న కృష్ణాజిల్లా నుంచి పెద్ద ఎత్తున పందేల రాయుళ్లు తరలివస్తున్నారు. కనీసం రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు కోడి పందేలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో కోడి పందేల నిర్వహణపై నిషేధం ఉన్నప్పటికీ, పోలీసులకు తెలిసినా రాజకీయ బత్తిళ్ల వల్ల చూసి చూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఫలితంగానే మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారులు

జాతీయ రహదారి అనేక మలుపులతో ఉండేదని నేషనల్ హైవే అథారిటీ బైపాస్ రోడ్డు నిర్మాణం చేయకుండా గ్రామంలో పదుల సంఖ్యలో ఇల్లు కోల్పోతున్న నిర్వాసితుల మాటలు పట్టించుకోకుండా ఇళ్లను కూల్చి పది సంవత్సరాలు గడుస్తున్న రోడ్డుపై నేటికి తట్ట మట్టి పోయకుండా రోడ్డు నిర్మాణం చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రామచంద్రపురం గ్రామానికి కూతవేటు దూరంలో నేషనల్ హైవే అథారిటీ వారు టోల్గేట్ నిర్మించుకొని ఫీజులు వసూలు చేస్తున్నారని ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే ఇది జాతీయ రహదారా లేక డొంక రోడ్డా అనే సందేహం కలుగుతుందని ప్రతిరోజు ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉందని ప్రయాణికులు తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు ఈ రోడ్డు మీద ప్రయాణిస్తుంటే సముద్రంలో నీటి అలలపై నావలాగా తేలి ఆడుతున్నారని ప్రయాణం నిత్య నరకంగా మారిందని ఏ క్షణంలో ఏ ప్రమాదం ఎటు నుంచి ముంచుకొస్తుందోనని ప్రయాణికులు వాహనదారులు భయపడుతున్నారని ఆయన తెలిపారు. రోడ్డు నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని లేనిపక్షంలో రాజకీయాలకతీతంగా గ్రామస్తులను సమీకరించి రోడ్డు నిర్మాణం పూర్తి చేసే వరకు ఉద్యమ ఉధృతం చేసి రోడ్డును దిగ్బంధనం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు బుట్టి రాయప్ప చిలుకూరు వెంకటేశ్వరరావు.ఎస్ కే నాగులు మీరా. కౌలు రైతుల సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్. ఆయాల సంఘం జిల్లా కార్యదర్శి మర్సకట్ల త్యాగరాజు. సిపిఐ ఏ కొండూరు మండల పార్టీ కార్యదర్శి ముచ్చింతల వెంకటేశ్వరరావు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కే సుభాని ఏఐ వైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ యాసిన్ సిపిఐ సీనియర్ నాయకులు దాడి ఆదినారాయణ. కే.కృష్ణ. తేళ్లూరి సంగీతరావు. జి అంజిరెడ్డి.మహిళా సమాఖ్య నాయకులు కోలా లక్ష్మీకాంతం. ఉమ్మడి సుశీల భూక్య చిట్టెమ్మ. కంది సరోజినీ. లలిత. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటు సారాపై డ్రోన్లతో నిఘా

నవోదయం 2.0 కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నాటు సారా తయారీని లక్ష్యంగా చేసుకోవడంతో పాటూ నాటు సారా వినియోగం వల్ల ఆరోగ్య పరంగా వచ్చే నష్టాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సంక్షేమ శాఖల సహాయంతో సారా తయారీలో నిమగ్నమైన వారికి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూపించాలన్నారు. నాటు సారా తయారీ, వినియోగాలను నిరసిస్తూ నవోదయం 2.0 పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ & ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ మణికంఠ, అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ రెడ్డి, జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కోడి పందేలు !

గ్రామాలలో కోడి పందేలపై పోలీసులు తూతూ మంత్రంగానే దాడులు జరుపుతున్నట్లు సమాచారం. పోలీసుల దాడుల భయం లేకపోవడంతో నిర్వాహకులు ఎలాంటి భయం లేకుండా పబ్లిక్‌గానే పందేలు కుదుర్చుకుంటున్నారు. పోలీస్ కమిషనరేట్‌లోని భవానీపురం, కొత్తపేట (టూ టౌన్), నున్న రూరల్ (పాయకాపురం) పోలీస్ స్టేషన్ల పరిధిలోనే ఎక్కువగా కోడి పందేలు జరుగుతున్నాయి. గొల్లపూడి కరకట్ట, అంబాపురం, పీ నైనవరం, పాతపాడు, నున్నలో పోలవరం కాల్వ కట్ట, అటవీ ప్రాంతంలో పేదల కోసం నిర్మించిన ఇళ్ల సముదాయాల సమీపంలోనే ఉదయం ఆరున్నర గంటల నుంచే పందేలు జరుగుతున్నాయి. కోడి పందేల కోసం పలు ప్రాంతాల నుంచి వచ్చే పందేల రాయుళ్లతో ఆయా గ్రామాల్లోని సెంటర్లలో జన సందోహం కనిపిస్తుండటమే ఇందుకు ఉదాహరణ. ఇదిలావుండగా, స్థానికంగా ఉన్న రాజకీయ పార్టీల నేతల సహకారంతో పందేల రాయుళ్లు పోలీసుల నుంచి పెద్దగా దాడులు లేకుండా పందేలు నిర్వహిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. అయితే, ఉన్నతాధికారుల నుంచి అక్షింతలు పడకుండా ఉండేందుకు నెలలో అడపా దడపా ఒకటీ రెండుసార్లు కోడి పందేల శిబిరాలపై పోలీసులు దాడులు చేస్తున్నారు.

మొల్లమాంబ తెలుగు సాహిత్య సేవలో చిరస్మరణీయం

మంత్రి ఆదేశాలతో ముద్రించి మొల్ల రామాయణంగా ప్రసిద్ధి పొందిందన్నారు. రెండవ ప్రతి తమిళనాడులోని తంజావూరు సరస్వతీ గ్రంథాలయం, మూడవ ప్రతి కడప జిల్లా సిపి బ్రౌన్ గ్రంథాలయానికి చేరాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ శాఖాధికారి, సహాయాధికారి మహేశ్వరరావు, శ్రీనివాసరావు, వసతిగృహ సంక్షేమాధికారులు రజినీకుమారి, హేమప్రియా, మోజస్, ఆంజనేయులు, పర్యవేక్షకులు జయజ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ పర్యవేక్షకులు గంగాధరం పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు తగ్గించాలి

మిస్సింగ్ కేసులు మొదలైన కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని మరియు సదరు నేరాలు అరికట్టే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని,ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండే విధంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని, వేగ నియంత్రకాలు ట్రాఫిక్ సూచనలను తెలిపే సైన్ బోర్డులను అవసరమైన చోట హెచ్చరిక బోర్డులను ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయాలని సూచించారు.పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలి. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై ప్రతిరోజు దాడులు నిర్వహించా లన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి వారిని పూర్తిస్థాయిలో కట్టడి చేస్తే నేరాలు కూడా తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేర సమీక్షా సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిటిషన్లు, పోస్కో కేసులు, గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, చీటింగ్ కేసులు, 174 సి ఆర్ పి సి కేసులు, మిస్సింగ్ కేసులు, , గంజాయి, నాటుసారా ల కట్టడికి తీసుకోవలసిన చర్యల గురించి సమీక్షించారు. 112 ఎమర్జెన్సీ నెంబర్ల నుండి వచ్చు కాల్స్ కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వాటి పట్ల నిర్లక్ష్యం వహించకుండా వెనువెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. కాల్ వచ్చిన సమయం మరియు సంఘటన స్థలానికి చేరుకున్న సమయాన్ని పరిగణలోకి తీసుకొని నిర్లక్ష్యంగా స్పందించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గారు అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి అడ్మిన్ జె.వి.సంతోష్ , నరసరావుపేట డిఎస్పి కే. నాగేశ్వరరావు, సత్తెనపల్లి డిఎస్పి ఎం.హనుమంతరావు, గురజాల డిఎస్పీ జగదీష్ గారు, ఆర్ ఐ లు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం : డీఈఓ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : కలెక్టరేట్ లో విద్యాశాఖ కార్యాలయంలోని తన చాంబర్లో పాత్రికేయుల సమావేశం నిర్వహించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు. మార్చి 17 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజె. రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 145 పరీక్షా కేంద్రాలలో ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయని, ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు విద్యార్థులు 8.30 గంటలకే వారి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 11,770 మంది బాలురు, 10,571 మంది బాలికలు కలిపి మొత్తం 22,341 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. పగడ్బందీ పరీక్షల నిర్వహణ నిమిత్తం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, రూట్ ఆఫీసర్స్, కస్టోడియన్, స్క్వాడ్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లును నియమించి సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది ఎవరికి పరీక్ష హాల్లోకి సెల్‌ఫోన్‌లు ఏవిధమైన ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో పరీక్షలు ప్రతిరోజు జరిగేవన్నీ ఆయా తేదీలలో నిర్వహించే పరీక్షల మధ్య ఒకరోజు సెలవు (గ్యాప్) ఇవ్వడం ద్వారా విద్యార్థి తరువాత రాసే పరీక్షకు సిద్ధమయ్యేందుకు సమయం ఉండాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా ప్రణాళిక రూపొందించిందని, తద్వారా విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచే అవకాశం ఉందన్నారు. మార్చి 17వ తేదీన తెలుగు, 19న హిందీ, 21న ఇంగ్లీషు, 22న ఓరియంటల్ ఎగ్జామ్, 24న గణితం, 26న భౌతిక శాస్త్రం, 28న జీవశాస్త్రం, 29న ఒకేషనల్ కోర్సు (లాంగ్వేజ్), 31లేదా ఏప్రిల్ 1న సాంఘిక శాస్త్రం పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షలకు సమాంతరంగా 23 పరీక్షా కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా జరుగుతాయని, మొత్తంగా 1,087 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పదవ తరగతి పరీక్షలు పూర్తయ్యేంత వరకు పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండే విధంగా విద్యార్థులు, వారి తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి పీవీజె. రామారావు సూచించారు.

21 నుంచి యూత్ పార్లమెంట్

-కృష్ణ యూనివర్శిటీ కోఆర్డినేటర్ శ్రావణి

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలను గుంటూరు, టి జె పి యస్ కళాశాల లో నిర్వహించడం జరుగుతుందని క్రిష్ణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణి పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో యూత్ పార్లమెంట్ పోస్టర్ ను క్రిష్ణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణి, స్టెల్లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జసిన్తా క్వాడ్రస్, వైస్ ప్రిన్సిపల్ ఉషా కిరణ్, ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, యూత్ పార్లమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్ కుమార్, స్టెల్లా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ స్వరూప రాణి ఆవిష్కరించారు. ఈ పోటీలను గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, యన్టిఆర్ జిల్లా ల నుండి 18 సంవత్సరాల నుండి 25 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఎవరైనా ఈ యూత్ పార్లమెంట్ పోటీలలో పాల్గొనవచ్చని, ముందుగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మై భారత్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకొని తరువాత ఒక్క నిమిషం నిడివి కలిగిన వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ అనే అంశం పైన వీడియో చేసి మార్చి 16 వ తేది అర్ధరాత్రి 11-59 సమయం లో పు మై భారత్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని తెలియచేశారు. వీళ్లందరిని స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయిలో ఎంపిక జరుగుతుందని,తరువాత ఈ ఐదు జిల్లాల నుండి ఎంపికైన వాళ్ళకి జిల్లా స్థాయిలో టి జె పి యస్ కళాశాల, గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో ఈనెల 21-22 తేదీలో 150 మంది విద్యార్థులకు పోటీ ఉంటుందని పేర్కొన్నారు.

కేయూలో నూతన కోర్సులు

విశాలాంధ్ర-మచిలీపట్నం: విద్యార్థులకు అనుకూలమైన వాతావరణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కృష్ణా విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె రాంజీ అన్నారు. గురువారం కృష్ణ యూనివర్సిటీలోని కాన్ఫిడెన్షియల్ హాల్లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ కింద 130 కాలేజెస్ ఉన్నాయని, పరీక్షలు నిర్వహించిన వెంటనే 20 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేయడం జరుగుతుందని, అలాగే లేడీస్ హాస్టల్స్, ఏం ఫార్మసీ కాలేజీలు ఈ సంవత్సరం జూన్ 30వ తేదీ కల్లా అందుబాటులోకి వస్తున్నాయని, బాయ్స్ హాస్టల్స్ క్యాంటీన్ నిర్మాణాలు ఈ సంవత్సరం డిసెంబర్ కల్లా అందుబాటులో ఉండనున్నట్లు ఆయన వెల్లడించారు. నా రోజుల్లో కాలేజీ రోడ్లు మేరక చేయించే పనులు ఉపాధి హామీ పనుల కింద పూర్తి చేయనున్నట్లు ఆయన అన్నారు. ఈ ఎకనామిక్ ఇయర్ లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో భవనాలు అందుబాటులో ఉంటాయని ఆయన వెల్లడించారు. నూతనంగా యూనివర్సిటీలో ఎం ఫార్మసీ కోర్సులను మొదలుపెడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం. వి. బసవేశ్వర రావు, రిజిస్టర్ ఎన్. ఉష, పరీక్షల పరిపాలన అధికారి పి. వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం , మాదలవారిగూడెం

టెండరు ప్రకటన

ఆర్.ఒ.సి.నెం:-03/2025 తేది: 13.03.2025

కృష్ణాజిల్లా,గన్నవరం మండలం, **మాదలవారిగూడెం** గ్రామ పంచాయతీ 2025-2026 సంవత్సరమునకు ఈ దిగువన ఉదహరించిన షెడ్యూలు దాఖలా టెండర్లు ను **ది:19-03-2025** వ తేది అనగా బుధవారం ఉదయం **10:30** గం.ల నుండి మధ్యాహ్నం 12:00 గం.ల వరకు మాదలవారిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయము నందు సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 01:00 గం.లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును.

వ.నెం.	పని వివరము	కాలపరిమితి	ధారావత్తు(ఒక్కరికి)	రిమార్కులు
1.	స్వీపర్స్- 5	2025-2026 సం॥	200/-	కాంట్రాక్టు లేబర్ పద్ధతి పై పని చేయుటకు
2.	ట్యాంక్ ఆపరేటర్స్- 2	2025-2026సం॥	200/-	
3.	ఎలక్ట్రీషియన్ - 1	2025-2026సం॥	200/-	
4.	నీటి సరఫరా సామాగ్రి	2025-2026సం॥	1000/-	టెండర్లు దాఖలు చేయు వారు షెడ్యూలు రూ.500/-లు చెల్లించి తీసుకోనవలెను.
5.	ప్రజా ఆరోగ్యం సామాగ్రి	2025-2026సం॥	1000/-	
6.	విద్యుత్ విడి భాగములు	2025-2026సం॥	1000/-	
7.	స్టేషనరి	2025-2026సం॥	1000/-	

గమనిక: 1. టెండరులో పాల్గొనే వారికి పని గురించి గతములో అనుభవము కలిగి ఉండవలెను. 2. గ్రామ పంచాయతీ నగదు నిల్వను బట్టి రోజు వారి వేతనములు చెల్లించబడును. 3. G.S.T మరియు I.T సర్టిఫికెట్లు టెండర్లు దాఖలు చేయువారువిధిగా ఇవ్వవలసియున్నది. 4. పాత టెండరుదారులకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించిన తదుపరి మాత్రమే కొత్తవారికి పేమెంట్ చేయబడును. 5. మిగిలిన వివరములు కార్యాలయము పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనగలరు.

సం/- శ్రీమతి లక్ష్మి ప్రసన్న
సర్పంచ్, మాదలవారిగూడెం

సం/- వెంకట సత్యరాజశేఖర్ కె
కార్యదర్శి, మాదలవారిగూడెం

మినుముపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ

విశాలాంధ్ర-గుడివాడ : మినుముపై జల్లిన పురుగు మందుతో పంట నష్టపోయిందని చిరిచింతల గ్రామానికి చెందిన రైతు ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం శాస్త్రవేత్తల బృద్ధం పరిశీలించినట్లు మండల వ్యవసాయాధికారిణి అనంతలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ కోటి, శ్రీదేవిలు ఇచ్చిన ఫిర్యాదులపై కెవిజె ఘంటాశాల ప్రిన్సిపల్ సెయిన్‌టిస్టు సుధారాణి, లహరిలు పరిశీలించడం జరిగిందన్నారు. వారు ఇచ్చే ఫిర్యాను బట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం మినుము తీస్తున్న రైతులను పొలాం దిగుబడిపై అరా తీయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వి.ఎ.ఎ శ్రీకాంత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైలు కింద పడి మహిళ మృతి

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక మోటూరు రైల్వే స్టేషన్ పరిధి నుండి - మండవల్లి రైల్వే స్టేషన్ల మధ్యలో గుర్తు తెలియాని మహిళా రైల్ నుండి జారి పడి మృతి చెందనట్లు రైల్వే ఎస్.ఐ ఎం.షరీఫ్ గురువారం తెలిపారు. గుర్తు తెలియాని మహిళా వయసు సుమారు 30-35స॥ ఉంటుందని, గుర్తు తెలియని రైలు బండి నుండి జారిపడి బలమైన గాయములు అయి అక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు ఆచూకీ తెలిసినవారు గుడివాడ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని తన ప్రకటనలో తెలిపారు.

కారుని ఢీకొన్న ఓఎన్‌జీసీ వాహనం

విశాలాంధ్ర-కృత్తివెన్ను : 216 జాతీయ రహదారిపై అతి వేగంతో ముందున్న కారుని ఓఎన్జిసి క్రేన్ భారీ వాహనం ఢీకొట్టింది. వివరాలు ఉన్నాయి. మండలంలోని లక్ష్మీపురం లాక్ సెంటర్ వద్ద గురువారం ఉదయం కారు వెనకే అతి వేగంగా వచ్చిన ఓఎన్జిసి భారీ వాహనం కారుని ఢీ కొంది. కారులో బెలూన్ తెరుచుకోవడంతో వారికి ప్రాణాపాయం తప్పింది. స్వల్ప గాయాలైన కారులో ప్రయాణికులు చికిత్స కోసం భీమవరం ఆస్పత్రికి వెళ్లినట్లు ఎస్ఐ ఎ పైడిబాబు తెలిపారు. ప్రమాదంపై ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ సుబ్రహ్మణ్యం, చిలంకుర్తి శివకృష్ణ, పులగం శ్రీనివాసరావులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన ప్రయాణికులకు పరిచర్యలు చేశారు.

ఎరువు, పురుగు మందుల దుకాణాల తనిఖీ

విశాలాంధ్ర-పెడన : మండలంలోని ఎరువు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఏడీఏ ఎన్. రమాదేవి, మండల వ్యవసాయ అధికారి సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లకు పలు సూచనలు చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

అన్న క్యాంటీన్‌లో

పారిశుధ్య లోపం ఉండరాదు

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలోని అన్నా క్యాంటీన్లలో పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపం ఉండరాదని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సంబందిత అధికారులను ఆదేశించారు. స్థానిక అజిత్‌సింగ్ నగర్ అన్న క్యాంటీన్‌ను కమిషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌కు వచ్చేవారికి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేం దుకు పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. నోడల్ ఆఫీసర్లుకు కేటాయించిన తమ తమ అన్న క్యాంటీన్లలో మరమ్మతులుంటే తక్షణం మరమ్మతులు నిర్వహించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సీఈ శ్రీనాథ్‌రెడ్డి, సీపీ జివిజిఎస్‌వి.ప్రసాద్, ఇంచార్జ్ సీఎంవోహెచ్ డాక్టర్ సురేష్‌బాబు, ఎస్‌ఈలు సత్యకుమారి, సత్యనారాయణ, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నగర సుందరీకరణ పెంచేందుకు చర్యలు

నగర అందాలను మరింత పెంచేందుకు సుందరీకరణ పనులు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయం ముందు గల కాలువ సుందరీకరణ పనులను గురువారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో హరితాన్ని పెంచే దిశగా ప్రాంతాలను పరిశీలించి నివేదికను అదజేయాలన్నారు. అనంతరం ఆయా ప్రాంతాలను సుందరీకరించటమే కాకుండా, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ, కాలుష్యాన్ని తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో హార్టికల్చర్ డీడీ రామ్మోహన్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా బోర్లను పునరుద్ధరించండి

ఎండాకాలంలో నీటి ఎద్దడి లేకుండా బోర్లును పునరుద్ధరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కమిషనర్ పర్యటనలో భాగంగా డివిజన్లలోని సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక కార్పొరేటర్ ఉద్దంటి సునీతతో కలిసి 1వ డివిజన్‌లోని మధురనగర్ పప్పుల మిల్ సెంటర్, రైల్వే ట్రాక్ ఏరియా, గుణదల నుండి రామవర ప్పాడు వెళ్లే సర్వీస్ రోడ్, కార్మల్ నగర్, విఎంసి ఎంప్లాయిస్ కాలనీ పరిసర ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజలు తెలిపిన సమస్యలను పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించాలని అధికా రులను ఆదేశించారు. ఈ పర్యటనలో సీఈ శ్రీనాథ్‌రెడ్డి, సీపీ ప్రసాద్, సీఎంవోహెచ్ డా.సురేష్‌బాబు, ఎస్‌ఈలు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, అమృత పథకం జేడీ డాక్టర్ లత, యూసీడీ పీవో వెంకటనారాయణ, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల క్రీడా పోటీలకు పక్కా ఏర్పాట్లు చేయండి

శాసనసభ్యుల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల నిర్వాహణకు స్టేడియంలో ఏర్పాట్లును పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశించారు. బందర్‌రోడ్‌లోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంను కమిషనర్ గురువారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 18వ తేదీ నుండి 20 వరకు జరిగే శాసనసభ్యుల క్రీడల పోటీల నిర్వాహణలో ఎలాంటి లోపం లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో వీఎంసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి

విశాలాంధ్ర-పెడన : ఏకాగ్రత, పట్టుదల, కృషి, మంచి లక్ష్యం ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని డైట్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎం. వి. జి. ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ మేరకు విశ్వ భారతి హై స్కూల్ లో జరిగిన పదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ రాబోయే పదవ తరగతి పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు అనేక సలహాలు, సూచనలు చేశారు. నూరు శాతం ఫలితాలు రావాలని ఆకాంక్షిస్తూ ఎంతోమంది గొప్ప వ్యక్తులు సాధించిన విజయాలను ఫోటోలతో సహా చూపిస్తూ విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అప్స ఉపాధ్యక్షులు సాబుజాన్, అప్స మచిలీపట్నం డివిజన్ అధ్యక్షులు కె. వి. జాన్, చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ బి. హరీష్ బాబు, విజయానంద కాలేజీ డైరెక్టర్ వి. విద్యాధర్ హిందీ ఉపాధ్యాయులు అబ్దుల్ అమీన్, పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. గౌరీ ప్రసాద్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : మచిలీపట్నం ప్రాంతీయ రవాణా కార్యాలయనికి కేటాయించిన స్థలంలో భవన నిర్మాణం చేపట్టి సంబంధిత కార్యకలాపాలను అక్కడ నుంచి నిర్వహించాలని ఆర్టీఓకు శ్రీనివాస్ నాయక్‌కు, బీ.సీ సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం గురువారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రాంతీయ రవాణా కార్యాలయానికి కేటాయించిన స్థలం మచిలీపట్నంలో ఉన్నప్పటికీ, భవన నిర్మాణం చేపట్టకుండా అద్దె భవనాలో కార్యాలయ విధులు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. ఇది ప్రజాధనం వృధా కదా అన్నారు. కాబట్టి 12 మండలాలకు సంబంధించిన ఆ.ర్టీ.వో కార్యాలయాన్ని వెంటనే నిర్మించి అక్కడి నుంచే కార్యకలాపాలను నిర్వహించాలని ఆ.ర్టీ.వోను కోరామన్నారు. అలాగే వాహనాలకు ఫ్యాన్సీ నెంబర్లు, లక్కీ నెంబర్లు కోసం వాహనదారులు రుసుము చెల్లించి బిడ్ వేయడం జరుగుతుందన్నారు. అందుకోసం వారు ఎంత మొత్తం రుసుము చెల్లించారో గతంలో ఆన్లైన్లో డిస్ప్లే చేయడం జరిగేదన్నారు. కానీ గత కొంతకాలంగా డిస్ప్లే చేయడం లేదని, ఈ సౌకర్యాన్ని మరల పునరుద్ధరించాలని, దీనివల్ల వాహనదారులకు బిడ్ పై తగిన అవగాహన ఏర్పడుతుందన్నారు. పైన తెలిపిన అంశాలను పరిశీలించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆర్టీవో శ్రీనివాస్ నాయక్ కు బీ.సీ సంక్షేమ సంఘం తరఫున వినతి పత్రం సమర్పించగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో చింతపట్ల నాని, ధనికొండ చిన్ని, భోగిరెడ్డి చిన సుభాని, బబ్బు, నేల పాల దుర్గ, చేబోయిన కోటేశ్వరరావు, కాళ్ళంగి పాండు, తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం , మొగులూరు

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.03/2025 తేది : 13-03-2025

ఎన్.టి.ఆర్.జిల్లా కంచికచర్ల మండలం, మొగులూరు గ్రామ పంచాయతీ **2025-26 సం॥నకు** గ్రామ పంచాయతీ ఏరియాలో ఈ దిగువ వివరించిన పనులు చేయుటకు రేటు కాంట్రాక్టు పద్ధతిపై **05 (ఐదుగురు).** ది. **24-03-2025వ తేదీన ఉదయం 11.00**గంటల వరకు సీల్డు టెండర్లు తెరువబడును.

వ.నెం.	వివరములు	టెండరు కాలము	ధరావతు
1	గ్రామపంచాయతీ పరిధిలో రక్షిత మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యము, వీధి దీపముల నిర్వహణ పనులు, 5 (ఐదుగురు) వ్యక్తులచే నిర్వహించుటకు	ది.01-04-2025 నుండి ది.31-03-2026 వరకు (ఒక సంవత్సర కాలము)	1000/-

గమనిక : 1. గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2) గ్రామ పంచాయతీ నిధుల లభ్యత బట్టి చెల్లించుట జరుగును.

సం/- షేక్ మొహిద్దీన్ బి
సర్పంచ్, మొగులూరు

సం/- కె.సంగమయ్య
కార్యదర్శి, మొగులూరు

ఒరిజనల్ పాస్‌పోర్టు పోయినది

నేను **గుజ్జర్లపూడి దేవమణి, భర్త పేరు అబ్రహాం,** R/O 20-4/1-23, సుబ్బరాజునగర్, న్యూ రాజ రాజేశ్వరిపేట, విజయవాడ, A.P-520003. సెప్టెంబర్ నెల 2024 వ సంవత్సరంలో వచ్చిన వరదల కారణంగా నా యొక్క ఒరిజినల్ పాస్ పోర్ట్ వరదలకు పోయింది. పాస్ పోర్టు నెం: **W8173418,** is: తేది **24-12-2022,** ex: తేది **23-12-2032,** ఎవరికైనా దొరుకినచో కింది సెల్ నెంబరకు ఫోన్ చేయగలరు **-9440905533.**

పొలం ఒరిజనల్ దస్తావేజులు పోయినవి

కృష్ణాజిల్లా, బంటుమిల్లి మండలం, అర్తమూరు గ్రామనికి చెందిన **నాగుల వీరాంజనేయులు** S/O **నాగేశ్వరరావు** అను నేను మా స్వగృహం నుండి అర్తమూరు గ్రామంలోని మా వ్యవసాయభూమి తాలుకు ఒరిజనల్ దస్తావేజులు తీసుకుని బంటుమిల్లి గ్రామ బ్యాంకు వద్దకు లోను పనిమీద నా యొక్క ఆస్థికి సంబంధించిన పొలం ఒరిజనల్ డాక్యుమెంట్ అయిన **దస్తావేజు నెం 1343 / 2010** దస్తావేజులు మరియు వాటి జిరాక్స్ కాగితాలు తీసుకుని వస్తూవుండగా పొలం ఒరిజనల్ దస్తావేజు కవర్ ఎక్కడో దారిలో పడిపోయినది. ఎంత వెతికినా ఎక్కడ కనబడలేదు, ఎవరిని అడిగానా తెలియదు అని చెబుతున్నారు. ఎవరికైనా పొలం దస్తావేజుల కవర్ దొరికిన యెడల నా యందు దయఉంచి ఈ క్రింది అడ్రసుకు తెలియపరచవలసినదిగా వేడుకుంటున్నాను.

నాగుల వీరాంజనేయులు, తండ్రి నాగేశ్వరరావు
డోర్ నెం : 4 -141
అర్తమూరు, బంటుమిల్లి మండలం, కృష్ణాజిల్లా
ఫోన్ నెం : 9550863345

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ-1టౌన్, కొత్తపేట, శాల్పాశ్రమం, డోరు నెం. 9-69-6బి రు కాపురస్తులు - **తొత్తడి బాల దుర్గా రవి కుమార్ గారి భార్య తొత్తడి మహాలక్ష్మి,** వయస్సు: 32 సం॥లు., **(ఆధార్ : 5629 1351 2607)**

నేను పై అడ్రసు నందు నివశించుచున్నాను. నేను పై అడ్రసు నందు నివశించుచున్నాను. నా తల్లి గారైన **గుజ్జరి పద్మ గారు ది.01-10-2020వ** తేదీన ఒక వీలునామాను వ్రాయించి, సదరు వీలునామాను శ్రీ విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో **3వ పుస్తకం, నెం.356/2020**రుగా రిజిష్టరు చేయించి, దరిమిలా సదరు వీలునామాలోని యెట్టి మార్పులు చేర్పులు చేయకుండా అదియే ఆమె చిట్టచివరి వీలునామాగాయుంచి నా తల్లి గారైన **గుజ్జరి పద్మ గారు ది.26-10-2021**వ తేదీన పరమపదించినారు. నా తల్లి గారి జీవితానంతరము వారు వ్రాయించి రిజిష్టరు చేయించిన వీలునామాలోని అంశములు అమలులోనికి రాబడి, సదరు వీలునామా ప్రకారం పైతెలిపిన స్థిరాస్తిపై నాకు దాన దమన వినిమయ విక్రయాదీ సర్వ సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములతో సంక్రమింపబడి, సదరాస్తిని నేను ప్రత్యేకముగా స్వాధీనము చేసుకొని సర్వహక్కులతో అనుభవించుచూయున్నాను.

పైవిధముగా నాకు హక్కు కలిగియున్న నా స్థిరాస్థి తాలూకు ఒరిజినల్ రికార్డులోని లింకు దస్తావేజు అనగా శ్రీ విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో **ది.28-04-1997**వ తేదీన 1వ పుస్తకం, 592వ వాల్యూం, 7ల 14 పుటలలో నెం. 680/1997రుగా రిజిష్టరు కాబడిన లింకు ఒరిజినల్ హక్కు విడుదల దస్తావేజు మాత్రం **ది.11-03-2025**వ తేదీన అనగా మంగళవారము సాయంత్రము 4 టు 5 గంటల మధ్యలో పై అడ్రస్ గల నా స్వంత ఇంటి నుండి అమ్మ హొటల్ సెంటర్ నందు యున్న జిరాక్స్ షాపునకు జిరాక్స్ కాపీలు తీయించుకొను నిమిత్తము నడుచుకొని వెళ్ళుచుండగా మార్గ మధ్యలో కవర్లో యున్న నెం. **680/1997**రు గల లింకు ఒరిజినల్ హక్కు విడుదల దస్తావేజు యెచటనో జారి పడిపోయినది. ఎంత వెతికిననూ నాకు దొరికియుండ లేదు. సదరు దస్తావేజును నేను ఎక్కడ తనఖాగానీ, హామీగానీ యుంచలేదు. భవిష్యత్తులో సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల వారు దుర్వినియోగం చేస్తే వారిపై చట్టపరముగా క్రిమినల్, సివిల్ చర్యలు తీసుకోబడును. ఈ డాక్యుమెంటు ఎవరికైనా దొరికితే దయచేసి ఈ ఫోన్ నెంబరు **7382458525**కు తెలుపగలరు.

ఆరుతడి పంటల పరిస్థితి ప్రశ్నార్థకం

విశాలాంధ్ర, విస్సన్నపేట : పోలేరు రిజర్వాయర్ నుంచి మన రాష్ట్ర వాటాగా అందాల్సిన సాగు జలాలు అందకపోవటంతో మూడవజోన్ పరిధిలో సాగవుతున్న లక్షలాది ఎకరాల్లో పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని నీటిసంఘాల అధ్యక్షులు ఆళ్ల గోపాల కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు శాసనసభలో చర్చించి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు నీటిసంఘాల ప్రతినిధులు అధికారులతో కలసి రాష్ట్రవాటాగా ఎంత మొత్తం నీరు మూడవజోన్‌కు చేరుతుందనే విషయాన్ని రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన నూతిపాడు(102.కి.మీ.) రెగ్యులేటర్ వద్ద గురువారం పరిశీలించారు. ప్రస్తుతం మన రాష్ట్ర సరిహద్దులోకి కేవలం 234 క్యూసెక్కులకు మించి నీరందని దుస్థితి వారికి కనిపించింది. ఇది రామచంద్రపురం(117.కి.మీ.) వద్దకు చేరుకునే సమయానికి చివరి ప్రాంతాలకు ఇచ్చేందుకు ఏమీ మిగలవు. ఇక్కడి నుంచి తిరువూరు, మైలవరం, నూజివీడు, నందిగామ, గన్నవరం, దెందులూరు నియోజకవర్గాల పరిధిలో సాగవుతున్న సుమారు రెండు లక్షల ఎకరాలకు పైగా ఆరుతడి పంటలకు నీరందించాల్సి ఉంది. వేసవి సందర్భంగా తలెత్తే నీటిఎద్దడి తలెత్తకుండా తాగునీటి చెరువులను నింపకపోవటంతో భూగర్భ జలమట్టం అడుగంటి మరింత దయనీయ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. కేఆర్ఎంబీ ఇచ్చిన ఆదేశాల మేరకు గత ఏడాది డిసెంబరు మొదటి వారం నుంచి ఏప్రియల్ 15వ తేదీ వరకు రోజుకు కనీసం 1500 క్యూసెక్కులకు తగ్గకుండా నూతిపాడు రెగ్యులేటర్ వద్దకు నీరు చేరాల్సి ఉన్నా, అమలుకు నోచుకోలేదు. రైతులు నీటిసంఘాల ప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి తేగా ఎట్టకేలకు ఈ ఏడాది జనవరి రెండవ వారంలో నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నీటిసంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, మన రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. తిరువూరు, మైలవరం, నందిగామ, దెందులూరు, గన్నవరం శాసనసభ్యులు సైతం లక్షలాది ఎకరాల్లో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్య, న్యాయబద్ధంగా మనరాష్ట్రానికి చెందాల్సిన నీటివాటాల విషయాన్ని పూర్తిస్థాయిలో పట్టించుకుని శాసనసభలో చర్చించైనా తెలంగాణా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. నీటి విడుదలను పరిశీలించినవారిలో సాగునీటి వినియోగదారుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాల కృష్ణతోపాటు ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు చెందిన డీసీ చైర్మన్లు తాళ్లూరి రవిశంకర్, కటారి కోటేశ్వరరావు, కొల్లి శ్రీనివాసరెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, రావర్ల బాలకృష్ణ, దేవినేని సత్యనారాయణ, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎన్నెస్పీ ఏఈలు కె.మహేష్, పి.సునీత, ఎల్.బ్రహ్మం, కె.ప్రసన్నకుమార్, శ్రీనివాసరెడ్డి, వీరయ్య తదితరులు ఉన్నారు.

హోలీకి సహజ రంగులు వాడండి

విశాలాంధ్ర-ఉయ్యూరు: హోలీ పండుగను పురస్కరించుకొని రసాయన రంగస్వామి లో సహజరంగులు వాడాలని స్థానిక ఏజీ అండ్ ఎస్ జి కళాశాల ప్రిన్సిపాల్ ఎం శివనాద్ సూచించారు. వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు హోలీరంగుల విషయంలో గురువారం అవగాహన కలిగించారు. విద్యార్థులు తయారుచేసిన సహజ రంగులను కళాశాల ప్రత్యేక అధికారి సత్యనారాయణ తో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వృక్ష శాఖాధిపతి కిరణ్మయి రజిని విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

బాలమ్మ కళ్యాణ వేడుకలు

విశాలాంధ్ర-కూచిపూడి : నాట్య క్షేత్రమైన కూచిపూడిలో నాట్యాచార్యుల ఇలవేల్పు అయిన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి 262వ వార్షిక కళ్యాణ వేడుకల లో భాగంగా నాల్గవ రోజైన గురువారం వేకువ జామున అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించారు ఒకవైపు మంగళ వాయిద్యాలు, మరొకవైపు వేదపండితులమంత్రాల నడుమ ప్రశాంత వాతావరణంలో శాస్త్ర యుక్తంగా కళ్యాణ వైభోగం నిర్వహించారు .

పదవ తరగతి విద్యార్థులకు పెన్నుల

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి రవి ప్రకాష్ సిలికానాంధ్రసంజీవిని వైద్యాలయం ఆధ్వర్యంలో మొవ్వ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు 540 మందికి గురువారం పెన్నులను పంపిణీ చేశారు.

వెంట్రప్రగడ సౌత్ ఛానల్ పూడికతీత

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ నుండి గుడివాడ వైపు పంట కాలువ (సౌత్ ఛానల్) ను పూడికతీత ముందస్తుగా చేయటం జరుగుతుందని ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజగోపాల్ రావు గురువారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కోసం సాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా కాలవలలో పూడిక తీసి పైనుంచి వచ్చే నీరు పొలాలలోకి సునాయాసంగా వెళ్లే విధంగా పనులు ప్రారంభించినట్లు ఆయన వివరించారు. ఇరిగేషన్ డి ఈ భరత్, పెదపారుపూడి సాగునీటి సంఘం అధ్యక్షుడు కాగిత లక్ష్మీనారాయణ, పూడికతీత పనులను పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు.

తారక్ ప్రసాద్‌కు ఐఎస్ఏ సత్కారం

విశాలాంధ్ర-విజయవాడ: కార్మికరాజ్య బీమా (ఈఎస్ఐ) గుణదల ఆసుపత్రి ఆర్ఎంఓ, సివిల్ సర్జన్‌గా పనిచేసి ఇటీవల పదవీవిరమణ చేసిన డాక్టర్ ఉప్పలేటి తారకప్రసాద్ దంపతులను ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తేసియా లోజిస్ట్స్ (ఐఎస్ఏ) విజయవాడ నగర బ్రాంచ్ ఐఎంఏ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, విజయవాడ ఈఎస్ఐ ఆసుపత్రిలో 25 సంవత్సరాలు సివిల్ సర్జన్ ఎనేస్తేటిస్ట్‌గా ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. రోగులకు, ఆసుపత్రి అభివృద్ధికి తారక ప్రసాద్ సేవలు చిరస్మరణీయమని ప్రశంసించారు. సివిల్ సర్జన్, అనెస్తటిస్ట్‌గా తారకప్రసాద్ వేలాదిమంది సర్జరీలకు ఎనస్తీషియా సేవలు అందించారన్నారు. లే సెక్రటరీ ఇన్‌చార్జిగా చాలా కాలం సేవలు అందించారనీ, సివిల్ సర్జన్, ఆర్ఎంఓగా పనిచేస్తూ హాస్పటల్ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. రాజమండ్రిలోని ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కూడా తారకప్రసాద్ పనిచేశారు. వైద్యునిగా సేవలు అందిస్తూనే తన తండ్రి కీ.శే ఉప్పలేటి ప్రసాదరావు ఆశయాలకు అనుగుణంగా పేద, అట్టడుగు, దళిత వర్గాల అభివృద్ధికి ఎనలేని కృషిచేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఐఎస్ఏ సిటీ బ్రాంచ్ కార్యదర్శి దివ్య రావెల, ఉపాధ్యక్షులు కీర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీదేవి, కోశాధికారి పావన ఫణి, భీమేశ్వర్, నేషనల్ ఫాస్టు ప్రెసిడెంట్ రాజగోపాల్, కిరణ్, దుర్గాప్రసాద్, లక్ష్మీనారాయణ తదితరులు తారకప్రసాద్ విశ్రాంత జీవితం సుఖమయంగా సాగాలనీ, మరింతగా ప్రజాసేవా కార్యక్రమాలలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రామాయణాన్ని సంస్కృతంలో నుంచి తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య అన్నారు. గురువారం తుమ్మలపల్లి క్షేత్రంలో మొల్లమాంబ జయంతి వేడుకలు ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘము ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం ఐలాపురం వెంకయ్య మాట్లాడుతూ కుమ్మరి కులస్తులకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలతో పాటు కుండల తయారీకి ఆధునిక పరికరాలను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలో శాలివాహన సంఘ భవనానికి ప్రభుత్వం 5 ఎకరాల స్థలాన్ని కేటాయించి,కుమ్మరుల తయారు చేసిన వస్తువులను మార్కెట్‌లో విక్రయించేందుకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆర్.టి.ఐ కమిషనర్ ఐలాపురం రాజా, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ శ్రీనివాస్,ఎన్టీఆర్ జిల్లా ప్రెసిడెంట్ బొమ్మని శ్రీనివాస్,నగర ప్రెసిడెంట్ భర్తవరపు దుర్గాప్రసాద్,సత్యనారాయణ మూర్తి,కులసంఘీయులు పాల్గొన్నారు

నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర -గూడూరు: కప్పలదొడ్డిలో వాసవ్య మహిళా మండలి -అమ్మ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో హెచ్ సి ఎల్ ఫౌండేషన్ సహకారంతో పుణ్యవతి కలంకారి యూనిట్ దగ్గర కలంకారి కార్మికులకు సుమారు మూడు వందల మంది కళాకారులకు మరియు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరిగింది. కలంకారి ని ప్రపంచం మొత్తం విస్తరింపచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు వాసవ్య మహిళా మండలి వారు రామాంజనేయులు, విజయ్, హెచ్సీఎల్ ఫౌండేషన్ నుండి శ్రీనివాసులు, దీక్షిత వారితోపాటు గ్రామ సర్పంచ్ యక్కల మాధవి ఎంపీటీసీ సభ్యులు పేరిశెట్టి తేజవతి. పెడన ప్రముఖులు కలంకారి భీమలింగం , వేణు , మాజీ సర్పంచ్ కట్ట మునీశ్వరరావు మరియు గ్రామ ప్రముఖులు, కలంకారి కళాకారులు చేనేత కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వరిలో మేలైన పద్ధతులు

విశాలాంధ్ర-కంచికచర్ల: చెవిటికల్లులో జీపీపి పొలంబడి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు వరి పంట లో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి నందిగామ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ ఐ కే శ్రీనివాస వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు సిఫార్సు మేరకు రసాయనిక ఎరువులను వినియోగించాలి,సమగ్ర కాలుపు యాజమాన్యం, నీటి యాజమాన్యం చేపట్టడం, ఎలుకల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నందిగామ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ ఐ కే శ్రీనివాస, మండల వ్యవసాయ అధికారి కె. విజయ్ కుమార్ మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు దుర్గ ప్రసాద్, హనేష్, రఘు, సాయితేజ పాల్గొనడం జరిగింది.

పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించండి

విశాలాంధ్ర-గన్నవరం : పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న అధిక పనిభారం పని ఒత్తిడి తగ్గించాలని కార్యదర్శులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవోకి వినతి పత్రం ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షులు సరోజిని మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలతో తీవ్ర పని భారానికి గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి నాట్య శిల్పారామం శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం ల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ బాలా త్రిపుర సుందరి సంబంధ రామలింగేశ్వర స్వామి 262వ వార్షిక కళ్యాణ మహోత్సవ అనుబంధ సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మూడవరోజు గురువారం పద్మశ్రీ డాక్టరు వేదాంతం సత్యనారాయణశర్మ,కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుగ్రహితపసుమర్తి రత్తయ్య శర్మలశిష్యుడు నాట్యాచార్య మాదుకోమలబాబుతన శిష్యులు తోప్రదర్శించిన అంశాలు పూర్వ సాంప్రదాయంలో కొనసాగి ఆహుతులను అల్లరింపజేశాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : పెదవడ్లపూడిలో మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను టీడీపీ నాయకులు గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన సాదు దుర్గాదేవికి రూ.4,68,978లు చెక్కును, కొండపల్లి శ్రీలక్ష్మికి రూ.3,60,574లు చెక్కును, మేదరమెట్ల వెంకటేశ్వరావుకు రూ.30 వేలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్, గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, సీనియర్ నాయకులు మాదల రమేష్ బాబు, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు నడపన దుర్గారావు, జాలాది సందీప్, కంచర్ల బద్రి, చింతల ఏడుకొండలు, నాగేశ్వరరావు, నాగమణి, భరత్, బొర్రా శ్రీకాంత్, ఏసు, ముప్పవరపు శ్రీనివాస రావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల సందర్శన

విశాలాంధ్ర-దుర్గి: మండల కేంద్రమైన దుర్గి, ఓబులేశునిపల్లె, ధర్మవరం గ్రామ సచివాలయాలను గురువారం గురజాల డీఎల్ డీవో గబ్రూ నాయక్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన సచివాలయాల వారీగా సర్వేలు జరుగుతున్న పనితీరును పరిశీలించారు. సర్వేల నమోదు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. తొలత సచివాలయాల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ శివప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ ఉన్నారు.

పరీక్షా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-ఈపూరు: విద్యార్థులంతా ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలకు హాజరై మంచి ఫలితాలను సాధించి, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు అన్నారు. మండలంలోని కొండ్రముట్ల గ్రామంలో జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు యంగ్ స్టార్స్ హెల్పింగ్ హాట్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏజీపీ ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల లో చదివే విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తుందని అన్నారు.ప్రతి విద్యార్థి పదవ తరగతి పరీక్షలు బాగా వ్రాసి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం మాజీ సర్పంచి గంగవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని నేటి సమాజంలో చదువుకున్నవారికే గౌరవం గుర్తింపు ఉంటాయన్నారు. ఫౌండేషన్ అధ్యక్షులు పమిడిపల్లి అనిల్ రాజ్ సభ్యులు రత్నరాజ్ మనోహర్ సునీల్ వెంకట్రావు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-తాడికొండ : తాడికొండ రూరల్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా దంత, చర్మ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి 152 మంది విద్యార్థులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు తేజ్ కుమార్, నళిని దేవి, కమల శ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలకు హాజరు కావాలి : అద్దంకి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో మానసిక ప్రశాంతతో పరీక్షలకు హాజరు కావాలని ఐఏఎస్ అధికారి డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు అన్నారు. స్థానిక ఎన్జీజీవోస్ కాలనీలోని సుమేధ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణా సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అతిథిగా విచ్చేసిన శ్రీధర్ బాబు విద్యార్థులు పరీక్షా సమయంలో ఎదుర్కొనే ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, విజయాన్ని సాధించడానికి సరైన మార్గ దర్శకత్వం ఎలా పొందాలి అనే అంశాలపై వారు విద్యార్థులతో అనుభవాలు పంచుకున్నారు. సమయపాలన, క్రమశిక్షణ విద్యార్థుల విజయానికి మూల స్తంభాలని అన్నారు. ఈ సెషన్ ద్వారా విద్యార్థులు పరీక్షా ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు అవసరమైన మానసిక సిద్ధత, సమయ నిర్వహణ, సకారాత్మక ఆలోచనల పట్ల ప్రేరణ పొందారు. శ్రీధర్ బాబు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకోవడం ద్వారా, వారికి ఆత్మవిశ్వాసాన్ని, స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకునే శక్తిని అందించారు. సుమేధ హైస్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఈ సెషన్ ద్వారా పొందిన జ్ఞానం, ప్రేరణ వారి విజయానికి దోహదపడుతుందని ఆశించారు.

అంతర్జాతీయ అవార్డును సాధించిన కేఎల్‌యూ విద్యార్థి

విశాలాంధ్ర-తాడేపల్లి: కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జాంబియాకు చెందిన మోజెస్ అనే విద్యార్థి భారతీయ అమృత్ మహోత్సవ్-2025 అవార్డుకు ఎంపికయినట్లు సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంబైలోని అంధేరీ వెస్ట్‌లో ఈ నెల 13న షీబా మీడియా వర్క్ షాప్ వారు నిర్వహించిన ఫ్యాషన్ షో పోటీలను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించారు. ముంబై హస్టల్ ఎడిటర్ దిల్షాద్ ఎస్.ఖాన్, ప్రముఖ సెలబ్రిటీ యాంకర్, మిస్ ఇండియా, నటి, టివి టాక్ షో హోస్ట్ సిమ్రాన్ అహుజా తో సహ పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయి విజేతలకు అవార్డులను ప్రదానం చేశారని ఆయన తెలిపారు. కెఎల్ సాక్ విభాగంలోని ఫ్యాషన్ అనే క్లబ్ కు చెందిన మోజెస్ అనే విద్యార్థి అంతర్జాతీయ స్థాయి ఫ్యాషన్ షో లో పాల్గొని అవార్డు సాధించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని సాయి విజయ్ అన్నారు. తమ వర్సిటీలో ఉన్న స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) ద్వారా పలు రకాల క్లబ్ ల ద్వారా విద్యార్థులను వారికి ఆసక్తి ఉన్న రంగంలో విశిష్టమైన నిపుణుల ద్వారా ప్రత్యేక శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా సాక్ విభాగానికి చెందిన విద్యార్థులు ఆయా గ్రామాలలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్ తదితరులు పాల్గొని విద్యార్థి మోజెస్ ను అభినందించారు.

తెనాలిలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రపై ర్యాలీ

విశాలాంధ్ర-తెనాలి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం పురపాలక సంఘంలోని అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఆ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుండి తెనాలి పట్టణంలోని ప్రధాన వీధులలో కొనసాగింది. ర్యాలీలో భాగంగా ప్రధాన సెంటర్లలో ప్రజలను ఉద్దేశించి తెనాలి కమీషనర్ బండి శేషన్న మాట్లాడుతూ ప్రజలందరూ పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిర్మూలించుటకు గాను, పట్టణంలో 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను వాడకూడదని చెప్పారు. పట్టణంలో కొన్ని సెంటర్లలో ప్లాస్టిక్ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలందరూ ఒక కేజీ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను కలెక్షన్ సెంటర్లలో జమచేసిన వారికి ఒక కేజీ టమోట, కేజీ పంచదార, కేజీ సేమ్యా, అరడజను గుడ్లు, అరలీటరు పాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్లాస్టిక్ నిర్మూలించుటలో తమ వంతు సహకారం అందించాలని కోరారు. హోల్ సేల్, రిటైల్ వ్యాపారస్తులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిల్వ చేయడం, అమ్మడం చేయకూడదని చెప్పారు. వీధి వ్యాపారులు, కూరగాయల మార్కెట్లలో, పండ్ల మార్కెట్లలో, మాల్స్‌లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పరికరాలు, క్యారీ బ్యాగులు నిల్వచేయడంతో పాటు వినియోగించడం పూర్తిగా నిషేధించడమైనదని అన్నారు. ఈ నిబంధనలు అతిక్రమించిన యెడల పెనాల్టీ విధించుట, షాపు లైసెన్స్ రద్దు పరచడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

కిడ్నీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-మంగళగిరి : ఎయిమ్స్ హాస్పటల్లోని ప్రముఖ వైద్యులు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ అహంతేం శాంతా సింగ్, డీన్ విద్యావేత్త ప్రొఫెసర్ శ్రీమత్ కుమార్ దాష్, హెచ్ఓడీ విభాగం డాక్టర్ ఉత్తర దాస్, మెడికల్ సూపరిం టెండెంట్ ప్రొఫెసర్ నటరాజ్ నేతృత్వంలో గురువారం ప్రపంచ కిడ్నీ దే సందర్భంగా ఎయిమ్స్ హాస్పిటల్ ఆవరణ నుంచి ముఖద్వారం వరకు కిడ్నీ వ్యాధి సమస్యలు వాటి నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 13వ తేదీన ఎయిమ్స్ అధ్వర్యంలో 2006 నుంచి ప్రపంచ కిడ్నీ దే నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రపంచ జనాభాలో దీర్ఘకాల కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఉన్నారని చెప్పారు. అధికంగా జంక్ ఫుడ్ తినటం మద్యపానం, ధూమపానం, చెడు వ్యసనాలు ఉన్న వారికి ప్రపంచవ్యాప్తంగా కిడ్నీ సమస్యలు అధికంగా నమోదు అవుతున్నాయని తెలిపారు. బీపీ, షుగర్ అదుపులో లేకపోవటం వల్లే కిడ్నీ సమస్యలు తలెత్తుతాయని అన్నారు. రెండు కిడ్నీలలో ఒక కిడ్నీ పాడైన దీర్ఘకాలం డయాలసిస్, కిడ్నీ మార్పిడి చేయాల్సి వస్తుందని చెప్పారు. వైద్యం అందుబాటులో ఉన్నా పేదలకు వైద్యం ఖర్చు భారంగా మారుతుందని అన్నారు. ప్రతిరోజు వ్యాయామం పౌష్టిక ఆహారం, మంచినీరు త్రాగటం బీపీ, షుగర్లను అదుపులో ఉంచుకోవడంతో కిడ్నీ సమస్యలు తలెత్తకుండా నివారించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, జూనియర్ డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడ్డే బాలయ్య మృతికి వెలుగూరి సంతాపం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వడ్డే బాలయ్య మృతి బాధాకరమని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి ఒక ప్రకటనలో అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ కోలుకోగలడని ఆశించామని, కానీ ఇంతలోనే ఈ వార్త విచారకరమని అన్నారు. ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గాను, జీజీహెచ్ ప్రధాన కార్యదర్శిగానూ బాలయ్య తన బాధ్యతలను ప్రతిభావంతంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఉద్యోగుల సమస్యల పట్ల అవగాహన కలిగిన వ్యక్తిగా వారి సమస్యల పరిష్కారానికి తీవ్రంగా తపించేవారన్నారు. సంఘ స్థానిక నాయకుడు నుంచి రాష్ట్ర అధ్యక్షుడుగా ఎదిగారన్నారు. అధికారుల పట్ల ఒకవైపు మంచి సంబంధాలు కొనసాగిస్తూనే, రెండవ వైపు ఉద్యోగుల సమస్యల పట్ల రాజీ లేకుండా, కఠినంగా వ్యవహరించేవారని అన్నారు. ఆయన మరణం వారి కుటుంబ సభ్యులకే గాక, జీజీహెచ్ ఉద్యోగులకు, ఏఐటీయూసీకి తీవ్ర నష్టదాయకమని అన్నారు. ఆయన మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-అమరావతి : మండల కేంద్రమైన అమరావతిలోని సత్తెనపల్లి రోడ్డులో గల ఆరు డొంకల బావి వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమరావతి ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం మండల కేంద్రమైన అమరావతిలోని సత్తెనపల్లి రోడ్డులో గల ఆరు డొంకల బాయి వద్ద సమీపంలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై తెలిపారు గత రెండు మూడు రోజులుగా అమరావతి సమీపంలో తిరుగుతూ హిందీ భాషలో మాట్లాడుతూ ఉండేవాడని.విచారణలో తేలిందన్నారు. అమరావతిలోనే ప్రభుత్వ హాస్పటల్ కి తరలించారు. అతని వయసు సుమారు 45 సంవత్సరాలు రంగు ఎరుపు ఎత్తు 5.7 అడుగులు మెడలో నల్లని పూసల దండ ఉన్నట్లు తెలిపారు, మృతదేహం. ఆచూకితెలిసినవారు స్థానిక సిఐ.ఎస్ఐలకు తెలియజేయాలని కోరారు. సమాచారాన్ని అమరావతి ఎస్ఐ నెంబర్ 8555 960221, సీఐ నెంబర్ 94407 96217 నెంబర్లకు తెలియజేయాలన్నారు.

ధ్వజస్తంభ ఊరేగింపు

విశాలాంధ్ర- తాడికొండ : నియోజకవర్గ కేంద్రమైన తాడి కొండ శ్రీ గిరీశ్వర స్వామి దేవస్థాన ఆవరణలో ఈ నెల 16న ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుంది. ఈ మేరకు గురువారం 35 అడుగుల పొడవు ఉన్న ధ్వజ స్తంభాన్ని ట్రాక్టర్‌పై మేళతాళాల మధ్య ఊరేగించారు. గ్రామస్తులు హారతులు ఇచ్చి టెంకాయలు కొట్టారు. ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా అన్నదానం జరుగుతుందని దేవస్థాన కార్యనిర్వాహణా ధికారి జీవీ నారాయణ తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ప్రారంభం

విశాలాంధ్ర-కాకుమాను : స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను జిల్లా స్కౌట్స్ సమన్వయకర్త ఎం.ఏడుకొండలు గైడ్స్ కెప్టెన్ ఉమాదేవిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి స్కౌట్స్ అండ్ గైడ్స్ నియమ నిబంధనలు, సమాజం పట్ల బాధ్యతలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ శిక్షణ కమిషనర్ నరేష్, ఎంఈఓ కెవిఎఫ్ కెనడి, ప్రధానోపాధ్యాయుడు బి.సత్యం, గైడ్స్ ఉపాధ్యాయుని బి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర-దుర్గి: అన్నదానం ఆకలిని తీర్చగలిగితే అక్షదానం అజ్ఞానాన్ని తొలగిస్తుందని శ్రీతులసి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాలలోని 220 మంది పదవ తరగతి విద్యార్థులకు గురువారం పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేస్తున్నదని, దానిలో భాగంగా గతంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్టియు వారు రూపొందించిన స్టడీ మెటీరియల్ మా సంస్థ సహకారం ద్వారా అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.కోటేశ్వరమ్మ, ఏపీ మోడల్ స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపల్ కృష్ణారావు, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.సిహెచ్. అనంతరా మయ్య, గణిత ఉపాధ్యాయులు హనుమంతరావు, శివానందకుమార్, విజయరాణి,కరీం, రవీంద్ర ,శేఖర్,,సతీష్, పీడీ ప్రసాద్, అబ్బాస్,పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ శీలం గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - దాచేపల్లి : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మ వారి ఆలయ అష్టమ వార్షికోత్సవాన్ని గురువారం కనుల పండువగా నిర్వహించారు. మూడు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు పూల గంపలతో ఊరేగింపు చేశారు. పుష్పార్చన, పుష్ప యాగంతో పాటు శ్రీవింధ్య వాహిని సమేత నగరేశ్వరస్వామి వారి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. తొలుత గణపతి పూజ, గణపతి హెూమం చేశారు. భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఎస్టీయూ నగర శాఖ, బీఆర్ అకాడమీ డైరెక్టర్ రావి భువనేశ్వరి ఆధ్వర్యంలో మూడు వేల మందికిపైగా మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్స్, ఎయిడెడ్ హైస్కూల్స్, వివిధ మండలాలలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షకు అవసరమయ్యే ఎగ్జామినేషన్ ప్యాడ్లను అందజేశారు. ఈ ముగింపు కార్యక్రమం అరండల్పేటలోని సెయింట్ ఇగ్నీషియస్ గర్ల్స్ హైస్కూల్లో గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ గుంటూరు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకయ్య, యు.మహంకాళ రావు, ఆర్థిక కార్యదర్శి సిహెచ్ జై సుందర్ కుమార్, సెయింట్ ఇగ్నేషియా గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మరియా రాణి, ఏఎన్యూ ప్రొఫెసర్ డి.కొండల రావు, ఎయిడెడ్ హిందీ ఉపాధ్యాయులు ఎస్కే షావలి, మున్సిపల్ కార్పొరేషన్ ఉపాధ్యాయులు కె.లీల, కోటేశ్వరరావు, బి.మధు, పి.లక్ష్మీనారాయణ, పి.మహేష్, ఏ.సురేష్, బీఆర్ అకాడమీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదినపాడులో చోరీ

విశాలాంధ్ర - దాచేపల్లి : గ్రామీణ మండలంలోని మాదినపాడులో గురువారం చోరీ జరిగింది. నర్సయ్య అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.2 లక్షల నగదుతో పాటు పది సవర్ల బంగారు నగలు అపహరించుకు పోయారని సమాచారం. పోలీసులు ఆ ఇంటిని సందర్శించి పరిశీలించారు. ఎంత మేరకు చోరీ జరిగిందనేది పోలీసు అధికారులు మాత్రం నిర్ధారించాల్సి ఉంది. బాధిత కుటుంబ సభ్యుల నుంచి రాతపూర్వక ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

వైసీపీ మద్యం కుంభకోణంపై

ఈడీ విచారణకు ఆదేశించాలి: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : రాష్ట్రంలో అయిదేళ్ల వైకాపా ప్రభుత్వంలో మద్యం అక్రమాలపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు ఆదేశించాలని, జగన్ దోచుకున్న రూ.వేల కోట్లు రికవరీ చేసి ప్రజలకే ఖర్చు పెట్టాలని ప్రభుత్వ చీఫ్విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. చత్తీస్గఢ్, ఢిల్లీ కంటే 10 రెట్లు ఎక్కువ స్థాయిలో ఏపీలో మద్యం కుంభకోణం చోట చేసుకుందన్న ఆయన, అందుకు కారణమైన ప్రతిఒక్కరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఈ మేరకు అసెంబ్లీలో జరిగిన చర్చలో మాట్లాడిన ఆయన మద్యపా లన నిషేధం చేస్తామనే హామీతో అధికారంలోకి వచ్చి అదే మద్యంలో వేలకోట్లు దోచుకున్న ఘనుడు జగన్ అని ఎద్దేవా చేశారు. జేబ్రాండ్ల మద్యంతో వైకాపా నాయకులు ప్రజల ప్రాణాలు తీశారని, అవినీతి, దోపిడీకి బ్రాండ్ అంబాసిడర్లు అయ్యారన్నారు. నాసిరకం మద్యం తాగి 40లక్షలమంది ఆస్పత్రి పాలయ్యారని, లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చిందన్నారు. 33వేలమంది ప్రాణాలు కోల్పోయారని, ఆ విధ్వంసానికి కారణమైన వారందరిపై బెల్టు తీయాల్సిందేనని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వంలో క్వాలిటీ మద్యం క్వార్టర్ రూ.99 ఉంటే నాడు నాసిరకం మద్యం క్వార్టర్ రూ. 230 వరకు అమ్మారని, బెల్ట్షాపుల్లో మళ్లీ రూ.50 అదనంగా బాదారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మార్చుతున్నామన్నారు. 90శాతం వరకు బెల్టు షాపులను కూడా కట్టడి చేసినట్లు తెలిపారు. గీత కార్మికులకు 10% కోటాతో 349 దుకాణాలు ఇచ్చినందుకు సీఎం చంద్రబాబుకు జివి ధన్యవాదాలు తెలిపారు.

కలెక్టర్కు అర్జీల సమర్పణ జయప్రదం చేయాలి: మేకపోతుల

విశాలాంధ్ర-మాచర్ల : అర్హులైన ప్రతి పేదవానికి ఇంటి స్థలం మంజూరుకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న కలెక్టర్ కు అర్జీల సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ మాచర్ల ఏరియా సెక్రటరీ మేకపోతుల శ్రీనివాస్ రెడ్డి కోరారు. గురువారం స్థానిక సిపిఐ కొమెర వీరాస్వామి భవన్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు గా ఇంటి స్థలాలను ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. అదేవిధంగా ఇంటి నిర్మాణానికి కూడా రూ.5 లక్షల ప్రభుత్వ రుణాన్ని అందించాలని ఆయన కోరారు. ఇప్పటికే సిపిఐ ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ నెల 15న ఉదయం 10 గంటలకు పల్నాడు జిల్లా కలెక్టర్ కు అర్జీల సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి భారీగా అన్ని ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో టౌన్ సెక్రటరీ మిద్దెపోగు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధుల పట్ల

అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సైలెంట్ కిల్లర్గా పేరుగాంచిన కిడ్నీ సంబంధిత వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ వి.శరత్ చంద్ర, కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ పెంట్యాల శ్రీకాంత్లు పేర్కొన్నారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా స్థానిక మంగళదాస్ నగర్లోని కిమ్స్ శిఖర హాస్పిటల్లో ఉచిత కిడ్నీ వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ 'మీ కిడ్నీలు బాగున్నాయా-ముందుగానే గుర్తించండి', 'కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడండి' అనే వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ థీమ్తో గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్లో ఉచిత కిడ్నీ వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే జీఆర్బీఎస్, సీరం క్రియాటిన్ కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ పరీక్షలు నిర్వహించి నెఫ్రాలజీ, యూరాలజీ డాక్టర్ల కన్సల్టెన్సీ సేవలను ఉచితంగా అందజేశారు. అనంతరం డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ శ్రీకాంత్లు మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే కిడ్నీ సంబంధ వ్యాధులను గుర్తించడం వల్ల క్రానిక్ కిడ్నీ జబ్బుల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి పది మందిలో ఒకరు దీర్ఘకాలిక కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతుంటే మన దేశంలో 10 లక్షల మందిలో 800 మంది కిడ్నీ జబ్బులతో బాధపడుతున్నారని తెలిపారు. క్రానిక్ కిడ్నీ జబ్బులతో 150 నుంచి 200 మంది బాధపడుతున్నట్లు గణాంకాలు చెప్పున్నాయని వారు పేర్కొన్నారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంపులను వంద మందికి పైగా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

ఎరువుల షాపులు తనిఖీ చేసిన వ్యవసాయాధికారులు

విశాలాంధ్ర - వినుకొండ : పట్టణంలో ఇంటర్నల్ స్క్వాడ్ తనిఖీ లో భాగంగా నర్సరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి. మస్తానమ్మ (ఏ.డి.ఏ) మరియు వినుకొండ మండల వ్యవసాయ అధికారి (ఏ.ఓ) జి. వరలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎరువుల షాపు లలో బయోస్టిమ్యులెంట్ల (జీవప్రేరకాలు) ల గుర్చి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దుకాణదారులు విక్రయిస్తున్న బయోస్టిమ్యులెంట్ల నాణ్యత, లైసెన్స్ మరియు లేబుళ్ల వివరాలను పరిశీలించారు. %+1,+2,+%3 ఉన్న బయోస్టిములెంట్స్ మాత్రమే రైతులకు విక్రయించాలని, అనధికార బయోస్టిమ్యూలంట్స్ రైతులకు విక్రయించినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన బయోస్టిమ్యులెంట్లు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి లేకుండా జీవప్రేరకాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు బయోస్టిమ్యులెంట్లు కొనుగోలు చేసే ముందు, ఉత్పత్తిపై ఉన్న లేబుల్ వివరాలు, తయారీ సంస్థ పేరు, అనుమతుల గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. నకిలీ లేదా నాసిరకం ఉత్పత్తులు ఎదురైతే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

కరాటే క్రీడాకారుడికి సీఎం ప్రశంస

విశాలాంధ్ర - వినుకొండ : కరాటేలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న వినుకొండ సమీపంలోని పెదకంచర్ల గ్రామానికి చెందిన యువక్రీడాకారుడు రామినేని రోహన్ను ఘనంగా సత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవలే దక్షిణాఫ్రికా రాజధాని దర్బన్ వేదికగా జరిగిన కామన్వెల్త్ 11వ కరాటే ఛాంపియన్షిప్ గెలుచుకున్న రోహన్కు ఏనుగు ప్రతిమ అందించి అభినందించారు. సీఎం చంద్రబాబు గురువారం ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వారిని తీసుకుని వెళ్లి ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. కొంతకాలంగా కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వరస విజయాలతో సత్తా చాటుతున్నాడు. అంతకు ముందు జాతీయ, జోనల్ స్థాయిలో పలు పతకాలు గెలుచుకుని కరాటేలో ప్రతిభ చూపాడు. రోహన్ వెంట ఆయన తండ్రి రామినేని శివకృష్ణ, తాత రామినేని రామ కోటయ్య, పెదనాన్నలు రామినేని పూర్ణచంద్రరావు, రామినేని సుబ్రమణ్యం ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రోహన్ ఇలాంటి మరెన్నో విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి, పల్నాడు ప్రాంతానికి, వినుకొండకు మరింత మంచిపేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

తహశీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర - వినుకొండ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రజల సౌకర్యార్థం మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్న క్రమంలో గురువారం వినుకొండ తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని తహసిల్దార్ ఎం.సురేష్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి రోజులు వచ్చిన కారణంగా కార్యాలయానికి రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఉన్న ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు మంచినీటికి ఇబ్బంది పడకుండా దాహార్తి తీర్చేందుకు ఈ మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిటి. మురళి, ఆర్ఐ శ్రీహరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో జీవించాలి

విశాలాంధ్ర-చిలకలూరి పేట: దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన వారు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో జీవితం కొనసాగించాలని డాక్టర్ ఆర్వీ సుబ్రమణ్యం చెప్పారు. రోష్ని సర్వింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరా ఫౌండేషన్ సహకారంతో పట్టణంలోని గుండయ్యతోటలో హెచ్ఐవీ బాధితులకు ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దురలవాట్లకు దూరంగా ఉంటూ పౌష్టికాహారం, క్రమం తప్పకుండా మందులు తీసుకోవడం ద్వారా హెచ్ఐవీ బాధితులు జీవన కాలాన్ని పొడిగించుకోవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ఆరా ఫౌండేషన్ సంస్థ సహకారం అందజేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో రోష్ని సంస్థ ప్రతినిధ్ని జిలానిబాషా, కోఆర్డినేటర్ ఏవీ రమణ, చైతన్య, వికాస్ పాల్గొన్నారు.

అప్పగించిన బాధ్యతలకు పూర్తి న్యాయం చేస్తా: భార్గవ్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాహుల్ గాంధీ, వైఎస్ షర్మిల రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతలకు పూర్తిగా న్యాయం చేస్తానని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్ అన్నారు. పార్టీ గుంటూరు జిల్లా కార్యాలయానికి గురువారం విచ్చేసిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వల్లూరు భార్గవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చిలక విజయ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు అవుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అన్నారు. ఎన్నికల ముందుకు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్యాలయ ఇన్‌చార్జ్ బిళ్ళా సునీల్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గద్దం పాల్ విజయకుమార్, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ రాచకొండ జాన్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు జొన్నాల వెంకటరెడ్డి, తవిటిశెట్టి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం

విశాలాంధ్ర, తెనాలి : ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థుల పరీక్షలకు హాజరగు సమయంలో హాల్ టికెట్ చూపిస్తే ఆర్‌టిసి బస్సులలో ఉచితంగా ఎక్కడి నుండి ఎక్కడికైనా ప్రయాణించవచ్చిని తెనాలి డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించు కోవాలని పేర్కొన్నారు. టెన్త్ క్లాస్ పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుండి ఈ నెల చివరి వరకు జరుగుతాయని చెప్పారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా తమ హాల్ టికెట్‌ను బస్సులో చూపించవలెనని చెప్పారు. పరీక్షా సమయమునకు చేరుకొనేందుకు సమయాన్ని పాటించాలని ఆయన పేర్కొన్నారు.

పశువులకు టీకాలు

విశాలాంధ్ర - కారంపూడి: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం లో భాగంగా గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లిసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జిల్లాలో జరుగుతోంది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా ఉపసంచాలకులు డాక్టర్ పి. రామారావు కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంలో పశుసంవర్ధక సిబ్బందికి పలు సూచనలు అందజేశారు.

పల్నాడు జిల్లాలో పది పరీక్షలకు సర్వం సిద్ధం

డీఈవో చంద్రకళ

విశాలాంధ్ర -నరసరావుపేట: ఈనెల 17వ తేదీ నుండి జరగబోయే పదో తరగతి పరీక్షలకు పల్నాడు జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ చంద్రకళ తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో 463 స్కూళ్ల నుండి 26,497 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 128 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో 68 ప్రైవేటు విద్యాసంస్థలు కాగా, 60 ప్రభుత్వ విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13,415 మంది విద్యార్థులు 13,082 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు విద్యుత్, త్రాగునీరు, టాయిలెట్లు, మెడికల్ మొదలగు సౌకర్యాలను పర్యవేక్షించేందుకు డిప్యూటీ డిఇఓ ఆధ్వర్యంలో త్రీ మెన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు. 1200 మంది విద్యార్థులు ఓపెన్ ఎస్ఎస్సి పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరి కోసం 27 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల విధినిర్వహణలో 1680 మంది ఇన్విజిలేటర్లుగా 280 మంది చెకింగ్ సూపరిండెంట్లుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్స్ పనిచేస్తాయని, ఓపెన్ ఎస్ఎస్సి కోసం రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్ పనిచేస్తాయని తెలిపారు. ఇంటి వద్ద నుండే హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకునేందుకు 9552300009 నంబర్ను వాట్సప్ లో విద్యాసేవ డౌన్లోడ్ చేసుకుని డేట్ ఆఫ్ బర్త్ అప్లై చేస్తే హాల్ టికెట్ డౌన్లోడ్ అవుతుందని తెలిపారు. ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చునని తెలిపారు.

పల్నాడు జిల్లాలో ఆరు సమస్యాత్మక పరీక్ష కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు.

విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులకు ప్రిపరేషన్ మెటీరియల్స్ అందజేసినట్లు, ప్రీ ఎగ్జామ్స్ నిర్వహించి విద్యార్థులకు తగు మెలుకువలు నేర్పినట్లు డీఈవో చంద్రకళ అన్నారు.

ట్రిబుల్ ఎక్స్ అధినేత అస్తమయం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ట్రిబుల్ ఎక్స్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్ గురువారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యం తో బాధపడుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు. తమిళనాడుకు చెందిన ఆయన గుంటూరులో స్థిరపడ్డారు. ఇక్కడి నుంచే సబ్బుల వ్యాపారం ప్రారంభించారు. ట్రిబుల్ ఎక్స్ సోప్ అనే సంస్థను మొదలుపెట్టి అంచెలంచెలుగా ఎదిగారు. తెలుగు రాష్ట్రాలో ట్రిబుల్ ఎక్స్ సోప్, ఇతర ఉత్పత్తుల గురించి తెలియనివారుండరు. ఎంతో మందికి తన సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పించి, ఎన్నో దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వితరణ చేసిన మానవతావాదిగా, పరోపకారిగా, సామాజిక సేవకులుగా, స్నేహశీలిగా అరుణాచలం మాణిక్యవేల్ గుర్తింపు పొందారు.

ప్రముఖుల సంతాపం..

ప్రముఖ వ్యాపారవేత్త, ట్రిబుల్ ఎక్స్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్ ఆకస్మిక మరణం పట్ల గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాణిక్య టవేల్ మరణ వార్త తెలుసుకున్న కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఢిల్లీ నుంచి ప్రకటన విడుదల చేశారు. ట్రిబుల్ ఎక్స్ సంస్థ ద్వారా అంచలంచెలుగా ఎదిగిన ఆయన ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం పట్ల సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వర రావు, బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు శిరిపురపు శ్రీధర్ శర్మ, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర ట్రెజరీ, బీసీ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ కుక్కల రాంప్రసాద్ తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

హక్కులకై పోరాటం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఉద్యోగులు వారికి రావాల్సిన హక్కులకై పోరాటం చేయాలని పీఎఫ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ కృపాకరన్ పిలుపు నిచ్చారు. గుంటూరు పీఎఫ్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ఉద్యోగుల కష్టసుఖాలను చర్చించారు. పీఎఫ్ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఏజే హుస్సేన్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ప్రసంగించారు. కారుణ్య నియామకాలు, పెన్షన్ మార్పిడి, ఉత్పాదక అనుసంధాన బోనస్ తదితర అంశాలను కృపాకరన్ దృష్టికి తీసుకువెళ్ళారు.

రేషన్ పంపిణీ వాహనం తనిఖీ

విశాలాంధ్ర - నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావు పేటలో చౌక ధరల ద్వారా బియ్యం పంపిణీ ఏ విధంగా నడుస్తున్నది అన్నదానిపై జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గానోరే గురువారం బియ్యం పంపిణీ చేస్తున్న వాహనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.రేషన్ బియ్యంస్టాక్ వివరాలు ఏ విధంగా ఉన్నాయని ఎం.యు.డి బియ్యం పంపిణీ దారులతో మాట్లాడారు.బియ్యం పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అనే విషయంపై వాహనం వద్దకు వచ్చిన కార్డుదారులతో మాట్లాడారు. రేషన్ పంపిణీ విషయంలో ఏ విధమైన అక్రమాలు జరిగిన కఠిన చర్యలు చేపడతామని, కేసు నమోదు చేస్తామని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నరసరావు పేట ఆర్డిఓ మధులత, తహశీల్దార్ ఉన్నారు.

ఇష్టంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు: విద్యార్థులు ఇష్టం చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో సత్యనారాయణ చెప్పారు. మండల కేంద్రమైన పెద్దకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం ఎంఈఓ సత్యనారాయణ పదో క్లాసు విద్యార్థిని విద్యార్థులకు ఈనెల 17వ తేదీ జరుగునున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి అవగాహన, సూచనలు,సలహాలు అందజేశారు. ప్రతి విద్యార్థి విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాల సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ ఎం కెవి రమణ, పీడీ నాగరాజు రాయిపూడి సాంబశివరావు, ఆర్కె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

ఆలయ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-రొంపిచర్ల: శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయ 6వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ పూజారి పేటేటి అంకారావు శర్మ శ్రీ చౌడేశ్వరి దేవిఅమ్మవారిని, కాలభైరవ స్వామివారిని ప్రత్యేకంగా, అందంగా అలంకరించి విశేష, సహస్రనామ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు, మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరుసిటీ, గోరంట్ల, యాదవుల బజార్ కాపురస్తురాలు ఆనందపల్లి గురవయ్యగారి కుమార్తె యున్నూ,కొండేటి బాల వెంకటేశ్వరరావు గారి భార్య యున్నూ అయిన కొండేటి రమాదేవి(సెల్:9704731743) గారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నాక్లయింటు తండ్రిగారైన ఆనందపల్లి గురవయ్యగారు తన ఆస్తులకు సంబంధించి ఒక వీలునామాను వ్రాయించి సదరు వీలునామాను ది.21-04-2012న దస్తావేజు నెం.40/బుక్ నెం.3/2012గా కొరిటెపాడు యస్.ఆర్.ఓ.లో రిజిష్టర్ చేయించి యున్నారు. అట్టి వీలునామా యొక్క ఒరిజినల్ దస్తావేజు మరికొన్ని డాక్యుమెంట్లను తీసుకొని ది.11-03-2025న పాత గుంటూరులోని నాక్లయింటు బంధువుల వద్దకువెళ్ళి వారికి చూపించి తిరిగి ఇంటికి రావటానికి ఆర్.టి.సి. బస్టాండుకు వచ్చి అక్కడ బస్ ఎక్కు తొందరలో సదరు ఒరిజినల్ వీలునామా గల కవరు పడిపోయినది. సదరు విషయాన్ని గమనించి మరలా ఆర్.టి.సి. బస్టాండు వద్దకు వచ్చి ఆ పరిసర ప్రాంతాలలో ఎంత వెతికిననూ, పలువురిని విచారించిననూ దొరికియుండలేదు. కావున సదరు ఒరిజినల్ వీలునామా దస్తావేజు నెం.40/బికె3/2012 ఎవరికైనా దొరికిన యెడల నాకు గాని, నా క్లయింటుకు గాని తెచ్చి ఇచ్చినవారికి తగిన బహుమతి ఇవ్వబడును. అట్లుగాక సదరు దస్తావేజును ఉపయోగించి ఎవరైనా అన్యాక్రాంతము జరిపినయెడల నాక్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

జింకల వెంకట సుబ్బారెడ్డి, అడ్వకేట్,
నగరాలు, గోరంట్ల, గుంటూరు, సెల్: 9705330633

CHANGE OF NAME

I, Gunala Sudharani (Old Name), W/O. Tamtam Kiran Kumar, D.No: 11-982/42, Sai Anjanaa Arcade, Bypass Road, Revenue Ward No: 11 Mangalagiri Post, Guntur Dist, A.P. Pin: 522503. I Have Changed My Name To **Sudha Kiran Tamtam (New Name).** Henceforth I will be known as **SUDHA KIRAN TAMTAM**

దస్తావేజులు పోయినవి

నాక్లయింట్ అయిన పల్నాడుజిల్లా యడ్లపాడు (మం), కొత్తపాలెం గ్రామ కాపురస్తులు అయిన రాట్నాల శ్రీనివాసరావు,S/o.వెంకటేశ్వర్లు అను వారి నుండి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా, కొండవీడు గ్రామ సర్వే నెంబర్:2/A మరియు 2/Bగల భూమికి సంబంధించిన దస్తావేజు నెంబరు:110/1996 ఒరిజనల్ డాక్యుమెంట్ ది. 07-03-2025న ఫిరంగిపురం గ్రామంలోని పోలీస బస్టాండ్ సమీపంలో దస్తావేజులు పోయినవి. నాక్లయింట్ ఎంతవెతికినా దొరకలేదు. యీ దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల దిగువ చిరునామాలో తెలుపగలరు.

యస్.ఏ. జమీర్, అడ్వకేట్ & నోటరీ,
14/1 అరండల్‌పేట, గుంటూరు. సెల్: 7382657414

అంతర్గత రోడ్లకు ప్యాచ్ వర్క్‌లను పూర్తి చేయాలి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన, అంతర్గత రోడ్లకు ప్యాచ్ వర్క్‌లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, ఏఈల వారీగా ప్యాచ్ వర్క్‌లపై బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టంచేశారు. స్థానిక ఏటీ అగ్రహారం, శాంతినగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను, జీఎంసీ వెహికిల్ షెడ్‌లో పారిశుధ్య పనులకు అవసరమైన సామాగ్రిని కమిషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు రోడ్లకు ప్యాచ్ వర్క్‌లను చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే నూతన రోడ్ల ఏర్పాటుకు ముందే డ్రైన్ల నిర్మాణం చేపట్టాలని స్పష్టంచేశారు. ప్యాచ్ వర్క్‌లను నామమాత్రం కాకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ చేసేలా ఏమినిటి కార్యదర్శులు, ఏఈలు పర్యవేక్షణ చేయాలన్నారు. వెహికిల్ షెడ్‌లో పర్యటించి, పారిశుధ్య పనులకు అవసరమైన కాల్వ పారలు, దంతేలు, బిన్లను వార్డ్‌ల వారీగా డిమాండ్‌కి తగిన విధంగా తెప్పించామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వాటిని తీసుకెళ్ళి వార్డ్‌ల్లో మరింత మెరుగైన పారిశుధ్య పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బాలాజీ నగర్‌లో పలు అభివృద్ధి పనులను పరిశీలించి, శివారు ప్రాంతాల్లో డ్రైన్ల ఏర్పాటుపై ఇంజినీరింగ్ అధికారులు, పారిశుధ్య పనులపై ప్రజారోగ్య అధికారులు దృష్టి సారించాలన్నారు. ఏటీ అగ్రహారంలో త్రాగునీటి శ్యాంపిల్ తీసి క్లోరిన్ శాతాన్ని తనిఖీ చేసి, ప్రతి రోజు ఏమినిటి కార్యదర్శులు సరఫరా సమయంలో శ్యాంపిల్స్ తీయాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు, సంక్షేమం కోసం వడ్డె బాలయ్య విశేష కృషి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కార్మికుల హక్కులు..సంక్షేమం కోసం విశేష కృషి చేసిన వ్యక్తి ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వడ్డె బాలయ్య అని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి అన్నారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఉన్న వడ్డె బాలయ్య గురువారం ఉదయం మృతి చెందారు. ఈ సందర్భంగా బాలయ్య భౌతిక కాయాన్ని యూనియన్ నాయకుల సందర్శనార్థం జీజీహెచ్‌లోని యూనియన్ కార్యాలయం వద్ద ఉంచారు. అక్కడ ఏఐటీయూసీ నాయకులు, మెడికల్ ఎంప్లాయిస్ నాయకులు జీజీహెచ్‌లోని వైద్యులు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుంటూరు సంజీవనగర్‌లోని ఆయన స్వగృహానికి తరలించారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ కాంట్రాక్ట్ వర్కర్లకు సంబంధించిన వారాంతపు సెలవులు ఇవ్వని పరిస్థితుల్లో బాలయ్య నాయకత్వంలో పోరాడి సెలవులు ఇప్పించిన ఘనత ఆయనకే చెల్లిందన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను ఇప్పించడంలోనూ..అలాగే ఉద్యోగులకు ప్రమోషన్లు ఇప్పించడంలో బాలయ్య కీలక పాత్ర వహించారని కొనియాడారు. అవసరమైన మేరకు కోర్టులను ఆశ్రయించి కార్మికుల హక్కులను సాధించారని అన్నారు. అదేవిధంగా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయడంలో ఆయన అహర్నిశలు శ్రమించిన ఆయన నేడు మన మధ్య లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తంచేశారు. నివాళులర్పించిన వారిలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌బాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సెక్రటరీ శశి, జీజీహెచ్ మెడికల్ బ్రాంచ్ నాయకులు పాల్గొన్నారు.

కోట మాల్యాద్రి

రావులపల్లి సంతాపం..

ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వడ్డె బాలయ్య మృతికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. యూనియన్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.

తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ : కలెక్టర్

విశాలాంధ్ర- గుంటూరు సిటీ: వాల్మీకి రచించిన రామాయణాన్ని సంస్కృతం నుండి సరళంగా సామాన్యులకు అర్థమయ్యే విధంగా తెలుగు భాషలోకి అనువదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ అని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ కొనియాడారు. గురువారం కలక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఆతుకూరి మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని వారి చిత్ర పటానికి కలెక్టర్ పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు.
బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ షేక్.ఖాజావలి, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. మొల్లమాంబ సాహిత్య సేవలను తెలుగు ప్రజలు ఎల్లవేళలా గుర్తుచుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ భవాని, కుమ్మరి, శాలివాహన సంక్షేమ సంఘ నాయకులు నాగేశ్వరి, పిడతల నాగమల్లేశ్వర రావు, చిరతనగండ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

జయ జయ హే జయకేతనం పోస్టర్లు ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: దేశ రాజకీయ చరిత్రలోనే పోటీ చేసిన ప్రతీ చోటా చారిత్రాత్మక విజయాన్ని అందుకున్న జనసేన పార్టీ పన్నెండవ ఆవిర్భావ సభ చరిత్రలో నిలిచిపోయేలా జరగనుందని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. రాష్ట్రం నుంచే కాక విదేశాల నుంచి సైతం జనసేన శ్రేణులు ఈ మహోత్కార్యంలో భాగస్వామ్యులు అయ్యేందుకు పిఠాపురం దారిపట్టాయన్నారు. శుక్రవారం జరగనున్న ఆవిర్భావ సభకు పవన్ కళ్యాణ్ జయకేతనం అని పేరు పెట్టిన నేపథ్యంలో జయ జయ హే జయకేతనం పోస్టర్లను స్థానిక శ్రీనివాసరావుతోటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నగర నాయకులు మెహబూబ్ బాషా, కొత్తకోట ప్రసాద్, కోలా అంజి, వడ్డె సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టొబాకో కంపెనీ తరలించండి: స్థానికులు

విశాలాంధ్ర-పెదకాకాని : పెదకాకాని యాగంటి అపార్ట్‌మెంట్ దగ్గరలో గల మాజీ ఎమ్మెల్యే ముస్తఫా టొబాకో కంపెనీ గృహ సముదాయాల మధ్యలో నడుపుట వలన కంపెనీ నుంచి వచ్చే డస్టు, పొగాకు వాసన కారణంగా ఆ ప్రాంతంలో ఉన్న కుటుంబాలలో ఐదుగురు క్యాన్సర్ బారిన పడి మరణించారని గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో అర్జీలు అందజేయగా పరిగణలోకి తీసుకున్న అధికారులు అక్కడ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత గృహ సముదాయాల ప్రజలు అధికారులకు వివరాలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కంపెనీ ఉండుటవలన ఆ కంపెనీ నుంచి వచ్చే ధూళి, టొబాకో వాసన పీల్చడం వలన చుట్టుప్రక్కల ప్రాంతాలలో నివసించే వారికి క్యాన్సర్ వ్యాధి వచ్చి ఐదుగురు దుర్మరణం చెందటం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గృహ సముదాయాల మధ్యలో ఉన్న పొగాకు కంపెనీని ఇక్కడి నుంచి తరలించి ప్రజలను వ్యాధుల నుంచి కాపాడాలని వేడుకున్నారు. అధికారులు మాట్లాడుతూ గృహ సముదాయాల మధ్యలో కంపెనీ ఉండటం ప్రజల అనారోగ్యానికి కారణం అవుతుందని, కనుక కంపెనీ యాజమాన్యం వెంటనే తగు చర్యలు చేపట్టి కంపెనీని ఇక్కడ నుంచి తొలగించే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, స్థానిక ప్రజలు దేవళ్ళ ఆంజనేయులు, అరుసుమల్లి వెంకటేశ్వరరావు, గరికపాటి రమేష్, దేవళ్ళ వెంకటేశ్వర్లు, దేవళ్ళ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా బ్రేకర్ల ఏర్పాటు

విశాలాంధ్ర - రెంటచింతల: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సబ్ స్టేషన్లలో బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ సీపీ డీసీ ఎల్ మాచర్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూతలపాటి సింగయ్య తెలిపారు. గురువారం మండల పరిధిలోని పాల్వాయి విద్యుత్ సబ్ స్టేషన్ లో రూ. 50 లక్షల బియ్యంతో నూతనంగా ఏర్పాటుచేసిన బ్రేకర్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. పాల్వాయి గ్రామానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు వీటిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతోనే వ్యవసాయ మోటార్లతో పాటు గ్రామాల్లో నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. కాలం తీరిన, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలతో పాటు తీగలను తొలగిస్తూ కొత్తవి ఏర్పాటు చేస్తూ మారుమూల గ్రామాలలో సైతం వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక విద్యుత్ అధికారి షేక్ మస్తాన్ వలి, లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసాచారి, పలువురు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల నుంచి అర్జీలు స్వీకరించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య కోరారు. గురువారం సాయంత్రం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో పేదల నుంచి సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లోని పేదలకు మూడు సెంట్లు, ఇంటికి స్థలం కేటాయించి ఇళ్ళు తామే స్వయంగా నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ బాషా, ప్రసాద్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి: ఖాజావలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ముస్లింలను కించపరిచే విధంగా మాట్లాడిన నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని ముస్లిం హక్కుల పోరాట సమితి (ఎంహెచ్‌పీఎస్)రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి గురువారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంతవరకు మన రాష్ట్రంలో లేని నీచ సంస్కృతితో ముస్లింలను కించపరుస్తూ రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ప్రాతినిధ్య వహిస్తున్న నియోజకవర్గంలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయటం దేనికి సంకేతం అని ఖాజావలి ప్రశ్నించారు. ఇటీవల రాయచోటిలో జరిగిన ఘటనపై నంద్యాలలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయటాన్ని పరిశీలిస్తే బీజేపీ ఈ రాష్ట్రంలో హిందూ, ముస్లింల మధ్య కలహాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు స్పష్టంగా కనబడుతుందన్న అనుమానాన్ని వ్యక్తంచేశారు. బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి సాక్షాత్తు శాసనసభలో ముస్లింలను కించపరుస్తూ మాట్లాడినప్పటికీ ముస్లిం శాసన సభ్యులతో పాటు ఏ ఒక్కరూ అతనిని నిరోధించకపోవడం ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండించకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పటికీ ముస్లింలు ఓటు వేశారని, చంద్రబాబు తమకు న్యాయం చేస్తారని నమ్మారని, కానీ కొంతమంది బీజేపీ నాయకులు చేస్తున్న ప్రకటనలు ముస్లింలకు భయాందోళనలకు గురి చేస్తున్నాయన్నారు. ముస్లింలను అభద్రత భావానికి గురికాకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించాలని, అందుకు విద్వేష పూరిత వ్యాఖ్యలు చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని సెక్యులర్ వాదులంతా ముస్లింలపై బీజేపీ నాయకులు చేస్తున్న విద్వేష పూరిత ప్రకటనలను ఖండించాలని, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖమంత్రి ఎండి ఫారుక్ వెంటనే స్పందించి ముస్లింల మనోభావాలు గాయపరిచే విధంగా ప్రకటనలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకొని తమ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్రంలోని మైనార్టీ వర్గాలకు అండగా నిలబడే విధంగా కృషి చేయాలని ఖాజావలి పేర్కొన్నారు.

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు
కృష్ణాజిల్లా, మోపిదేవి మండలం, పెదప్రోలు గ్రామములో వేంచేసియున్న

శ్రీ అద్దంకి నాంచారమ్మ
అమ్మవారి జాతర మహోత్సవమునకు
విచ్చేయు భక్తులకు స్వాగతం - సుస్వాగతం
మార్చి 14వ తేది శుక్రవారం
అమ్మవారి జాతర సందర్భముగా భక్తులు అమ్మవారిని దర్శించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము
ఆలయ అభివృద్ధి కమిటి
అభివృద్ధి కమిటి చైర్మన్ కుర్రా గురుప్రసాద్
పాలకవర్గ చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య
అభివృద్ధి కమిటి సెక్రటరీ కూరపాటి కోటేశ్వరరావు

అబాకస్ మాథ్స్ విజేతలుగా కొమ్మారెడ్డి విద్యార్థులు

విశాలాంధ్ర-బంటుమిల్లి :- అబాకస్ మాథ్స్ పోటిలలో కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ ,ద్వితీయ ,కన్సొలేషన్ బహుమతులు సొంతం చేసుకున్నారని కొమ్మారెడ్డి పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ తెలిపారు .స్థానిక కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ నందు ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి విద్యార్థులను గురువారం మెమోరీ మాథ్స్ అకాడమీ హైదరాబాద్ వారు అబాకస్ మాథ్స్ పోటీలను నిర్వహించారని కిషోర్ తెలిపారు .ఈ పోటిలలో ఒకటవ తరగతి నుండి కె అరుణ కుమార్ ప్రథమ స్థానం ,బి స్వప్న ప్రిన్సెస్ ద్వితీయ స్థానం , కన్సొలేషన్ బహుమతులను బి వేర్నిక ,టి మధుప్రియ ,బి గ్రీష్మ ,కె ప్రవీణ్ కుమార్ ,వి భవ్యశ్రీ .రెండవ తరగతి విజేతలుగా ఎం డి కౌసర్ ఫాతిమా ప్రథమ స్థానం ,ఎం షణ్ముఖ చంద్రశ్రీ ద్వితీయ స్థానం ,కన్సొలేషన్ బహుమతులు సాధిక్ బేగ్ ,పి వేద వర్షిణి ,కె లిఖిత్ చరణ్ దేవాన్ష్ ,బి పర్మిత ,పి భార్గవ్ సాయి .మూడవ తరగతి విజేతలుగా కె లహరి ప్రథమ స్థానం ,ఎం దీక్షాశ్రీ ద్వితీయ స్థానం ,కన్సొలేషన్ బహుమతులను బి ముకుంద శ్రీ మోక్షజ్ఞ ,ఎన్ సుధిష్ట నాగసాయి ,ఎస్ వినూత్న ,పి మేఘన ,డి కుసుమాంజలి .నాలుగవ తరగతి విజేతలుగా కె పుష్యమి ప్రథమ స్థానం ,టి తారక్ రామాంజనేయులు ద్వితీయ స్థానం ,కన్సొలేషన్ బహుమతులను వి జనని ,వి భువన దర్శిని ,ఇ అమృతహాసిని ,కె భవిష్య .ఐదవ తరగతి విజేతలుగా పి దేవి చరణ్ ప్రథమ స్థానం ,టి అయాన్ రమేష్ ద్వితీయ స్థానం .కన్సొలేషన్ బహుమతులను ఎం ఆహ్లాధిత ,కె అశ్విత్ కృష్ణ ,సిహెచ్ వి కార్తికేయ ,కె భార్గవ్ తేజ ,ఎస్ గాయత్రి కె సృజన్ గ్రేస్ లు బహుమతులను అందుకోవడం ఆనందదాయకమనీ కిషోర్ హర్షం వ్యక్తం చేశారు .అబాకస్ మాథ్స్ విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కె ఎస్ వి జి శోభ ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ శ్రీనివాసరావు ,ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళాభ్యుదయానికి క్రమశిక్షణతో సాధ్యం

విశాలాంధ్ర-పెనమలూరు : మహిళాభ్యుదయానికి సమాజ క్రమశిక్షణతో సాధ్యమని, విద్యాసంస్థలు ఆ దిశగా ఫలితాలు సాధిస్తున్నాయని పివిపి సిద్ధార్థ ప్రిన్సిపల్ కె శివాజీ బాబు అన్నారు. ప్రసాద్ వి. పొట్లూరి సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఫ్రెష్మన్ ఇంజనీరింగ్ విభాగం మరియు ఐక్యూఏసి సహకారంతో 2025 మార్చి 9 నుండి 13 వరకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఐదు రోజుల మహిళా ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం మహిళా అధ్యాపకుల ఆరోగ్యం, ఆనందం, శ్రేయస్సు మరియు మానసిక బలోపేతానికి ప్రోత్సహించడంపై దృష్టి పెట్టింది. ఇందులో మైండ్‌ఫుల్‌నెస్, థెరపీ మరియు సృజనాత్మకత వంటి అభ్యాసాల ద్వారా మానసిక శ్రేయస్సును పెంపొందించడం, ఉద్యోగ సంతృప్తి మరియు ఆరోగ్యకరమైన పని-జీవిత సమతుల్యతను ప్రోత్సహించడం ముఖ్యమైన అంశాలుగా తీసుకున్నారు. ఇది మహిళా అధ్యాపకుల వ్యక్తిగత మరియు వృత్తిపరమైన విజయానికి సహాయపడుతుందని సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఈడి హెచ్ఓడి ఎం శ్రీ లక్ష్మీ , ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా బి రఘు కుమార్, డా టి ప్రీతి రంగమణి, డా ఎస్ లక్ష్మీ తులసి, అనూప్, ఆంజినేయులు, మణికంత, వివిధ కళాశాలల అధ్యాపకబృందం పాల్గొన్నారు.

శాలివాహన సంఘం ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతి కార్యక్రమం

విశాలాంధ్ర-నందిగామ:- రామాయణ మహా గ్రంథాన్ని రచించిన కవయిత్రి మొల్లబాంబ జయంతి కార్యక్రమాలను నందిగామ సీతారామాంజనేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో మండల శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కన్వీనర్,శాలివాహన సంఘం నాయకులు తొలికొండ సీతారామయ్య,టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ తో కలిసి మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాయణ మహా గ్రంథాన్ని రచించిన కవయిత్రి మొల్లమాంబ ఎంతో పుణ్యం చేసుకున్నారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘ నాయకులు తొగటి నరేష్ కుమార్,తొర్లికొండ శ్రీనివాసరావు,కోరంపల్లి వీరబ్రహ్మం,బొమ్మన సురేష్,టి రాజారావు,కళ్యాణం మాధవి, బెజవాడ వెంకట్రావమ్మ, సిరివెళ్ల రామకృష్ణ,దివ్వెల వీరభద్రరావు,ఎస్ క్రాంతి కుమార్,తొర్లికొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి తరలిరండి

విశాలాంధ్ర-పెడన : ఈనెల 15వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు తోటమూల చూజి కంపెనీ వద్ద గల శాసనసభ్యులు వారి కార్యాలయము నందు గౌరవ పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలసౌరీ మరియు పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కలిసి హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కొరకై సహాయ సహకారాలు కోరుట గూర్చి వినతి పత్రం అందజేయడం జరుగును. కావున ఈ కార్యక్రమమునకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తరలివచ్చి మన హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఆగష్టేశ్వర స్వామి అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ళ. ప్రసాద్, బొడ్డు దీక్షనందుడు, కమ్మగంటి వెంకటేశ్వరరావు, తమ్మ భీమయ్య,, వాసా సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు

కనుల పండుగగా శ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ రూరల్ మండలం నున్నలో వేంచేసిన శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వార్ల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజైన గురువారం శ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. ఉత్సవాలలో భాగంగా రెండో రోజున దేవస్థానంలో నిత్యార్చన, ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం చిన్నారుల కోలాట నృత్యాలతో శ్రీ అన్నపూర్ణాదేవి, శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వార్లను పల్లకీలలో గ్రామ పుర వీధులలో ఊరేగించుకుంటూ స్థానిక చెరువు సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ అత్యంతవైభవోపేతంగా అమ్మవారు, స్వామివార్ల రాయబార కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం శ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామివార్లను ఆలయానికి తీసుకువెళ్లి కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవి పీఠాధిపతి మునీంద్ర మహరాజ్, ఆలయ ప్రధానార్చకులు, శివాచార్య డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ నేతృత్వంలో అమ్మవారు, స్వామివార్ల కల్యాణోత్సవం జరిగింది. నున్న, పాతపాడు, కుందావారి కండ్రిక, సూరంపల్లి, ముస్తాబాదతోపాటు విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం చిన్నారుఉ పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి ఎస్ హేమలతాదేవి మాట్లాడుతూ, శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చివరి రోజైన శుక్రవారం స్వామి వార్ల రథోత్సవం, దీపోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాదకద్రవ్యాలపై యువత అప్రమత్తం

విశాలాంధ్ర-విజయవాడ: మాదకద్రవ్యాల వినియోగం అత్యంత ప్రమాదకరమని యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్య లక్ష్మీ తెలిపారు. గురువారం కళాశాల సమావేశమందిరంలో జరిగిన మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయైన ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ వి స్వరూప రాణి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, శారీరిక, మానసిక ఆరోగ్యంతో సహా స్వల్ప దీర్ఘకాలిక ఆనరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ కార్యక్రమంలో రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రామ్మోహన్ రెడ్డి, డిస్టిక్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ బ్రహ్మం, యూత్ వెల్ఫేర్ ఆఫీస్ సూపర్డెంట్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్, ఎస్ ఆర్ ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ లక్ష్మీ శ్రావణి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అమ్రిత సాయిలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మండలం పరిటాల సమీపం లోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యం లో విజయవాడ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ వారి సౌజన్యం తో "మెగా రక్త దాన శిబిరం" ఏర్పాటు చేసినట్లు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ శ్రీ కె. రామ మోహన రావు తెలియ చేసారు. అమ్రిత సాయి యన్.యస్.యస్ యూనిట్ ఆద్వర్యం లో, రెడ్ క్రాస్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యస్. మదన్ మోహన్ సౌజన్యం తో ఏర్పాటు చేసిన ఈ రక్త దాన శిబిరాన్ని సెక్రటరీ కరస్పాండెంట్ శ్రీ కె. రామ మోహన రావు ప్రారంభించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ సరైన సమయం వారు లో రక్తం దొరకక పోవటం వల్ల చాలా మరణాలు సంభవిస్తున్నాయని, వీటిని ఆపాలంటే ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని విద్యార్థులని కోరారు. అమ్రిత సాయి విద్యార్థులు చదువు తో పాటు ఇటువంటి సేవా కార్యక్రమాల లో పాల్గొని సమాజం పట్ల తమ వంతు భాద్యత చూపించటం పట్ల హర్షం వ్యక్తం చేసారు. కళాశాల ప్రిన్సిపాల్ డా ఎం యమ్.శశిధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు 3 నెలలకు ఒక సారి రక్తదానం చేయవచ్చునని, దీని వలన మీరు ఆరోగ్యం గా ఉండడమే కాకుండా, రక్తం అవసరమైన వారికి జీవితాన్ని ఇచ్చిన వారు అవుతారని తెలియ చేసారు. ఈ శిబిరం లో మొత్తం 102 యూనిట్ల రక్తాన్ని సేకరించారు ఈ రక్త దాన శిబిరం లో అమ్రిత సాయి కళాశాల విద్యార్థులు, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు యన్.యస్.యస్ కో ఆర్డినేటర్ పి శ్రీనివాస రావు, ప్రోగ్రాం ఆఫీసర్ బి. సాయి రామ కృష్ణ మరియు అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

16న వారధి తెలుగు సాంస్కృతిక కార్యక్రమం

విశాలాంధ్ర- విజయవాడ ఎడ్యుకేషన్ : తెలుగు భాష పరిరక్షణ తో పాటు,వివిధ రంగాలలో నైపుణ్యం సాధించిన తెలుగు వారిని సత్కరించాలనే ఉద్దేశంతో ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో ' వారధి ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ అధ్యక్షులు జగన్ బాబు గంజి తెలిపారు. గుణదల లోని హోటల్ హయత్ నందు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 వ తేదీ సాయంత్రం 5 గంటలకు నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు, వివిధ రంగాల ప్రముఖులు ప్రసంగాలతో పాటు సత్కార కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ స్పీకర్ కె.రఘు రామ కృష్ణ రాజు పాల్గొంటారని తెలిపారు.అతిథులుగా మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్, పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాత్, పలువురు ప్రముఖులు పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కర్, ఏ. పి.హోటల్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్. వి.స్వామి , పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్లు రికవరీ చేసి యజమానులకు అందజేత

విశాలాంధ్ర - నరసరావుపేట: పల్నాడు జిల్లా వ్యాప్తంగా పలువురు పోగొట్టుకున్న మరియు దొంగతనానికి గురైన సుమారు 31 లక్షల 22 వేల రూపాయల విలువైన 223 సెల్ ఫోన్లను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు గురు వారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సమాచార చేరవేతకు, వినోదానికి, విజ్ఞాన సమూపార్జన కొరకు, విలువైన సమాచారాన్ని పొందుపరచుకు నేందుకు మొబైల్ ఫోన్లు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. చాలా సందర్భాల్లో ప్రజలు తమ సెల్ ఫోన్లను పోగొట్టుకోవడం లేదా దొంగలింపబడటం వలన చాలా ఇబ్బందులను ఎదుర్కొంటూ ఏమి చేయాలో దిక్కు తోచలేని పరిస్థితుల్లో పోలీసు వారిని ఆశ్రయిస్తున్నారన్నారు. పోలీసు వారు పోయిన సెల్ ఫోన్ల యొక్క వివరాలను బట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వాటిని వెతికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేకుండా బాధితు లకు అందజేసు న్నారన్నారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న లేదా దొంగతనానికి గురైన బాధితులు ఎంతో ఎలాంటి ఆందోళన చెందకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని లేదా సిఇఐ ఆర్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. తాము పోగొటు కున్న విలువైన ఫోన్లను రికవరీ చేసి ఇచ్చిన పోలీస్ యంత్రాంగాన్ని బాధితులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు. అదనపు ఎస్పీ (పరిపాలన) జెవి సంతోష్, నరసరావుపేట డిఎస్పి నాగేశ్వరరావు, గురజాల డిఎస్పి జగదీష్ మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

మాదినపాడులో చోరీ

విశాలాంధ్ర - దాచేపల్లి : గ్రామీణ మండలంలోని మాదినపాడులో గురువారం చోరీ జరిగింది. నర్శయ్య అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ 2 లక్షల నగదుతో పాటు పది సవర్ల బంగారు నగలు అపహరించుకు పోయారని సమాచారం. పోలీసులు ఆ ఇంటిని సందర్శించి పరిశీలించారు. ఎంత మేరకు చోరీ జరిగిందనేది పోలీసు అధికారులు మాత్రం నిర్ధారించాల్సి ఉంది. బాధిత కుటుంబ సభ్యుల నుంచి రాతపూర్వక ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

అగ్నివీర్ సిబ్బంది నియామకాల నమోదు ప్రారంభం

- ఏప్రిల్ 10 ఆఖరు తేది

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు చెందిన అభ్యర్థుల కోసం అగ్నివీర్ సిబ్బంది నియామకాలు 2025-26 నమోదును ప్రారంభించినట్లు ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయ డైరెక్టర్ కర్నల్ పునీత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీల అగ్నివీర్ల నియామకం కోసం www.joinindianarmy.nic.in ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. నమోదుకు ఏప్రిల్ 10 చివరి తేదీ అని చెప్పారు. ఒక అభ్యర్థి ఇప్పుడు రెండు వేర్వేరు అగ్నివీర్ కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సీఈఈ) మొట్టమొదటిసారిగా తెలుగుతో సహా 13 వేర్వేరు భాషల్లో నిర్వహించబడుతోందని చెప్పారు. అన్ని కేటగిరీలకు సంబంధించిన ఎన్‌సీసీ 'ఎ', 'బి', 'సి' సర్టిఫికెట్ కలిగిన వారికి, ప్రతిభావంతులైన క్రీడాకారులకు, అలాగే అగ్నివీర్ టెక్నికల్ కేటగిరీ కోసం ఐటిఐ/డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు కూడా ఇవ్వబడతాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురము, వైఎస్సార్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులందరూ అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ కార్యాలయ సహాయకులు/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ వృత్తి నిపుణుల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉంటుందని వెల్లడించారు.

అన్న క్యాంటీన్ల పరిసరాల్లో పచ్చదనం పెంపుకు చర్యలు : నగర కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : అన్న క్యాంటీన్లలో గ్రీనరీ, పరిశుభ్రత ఉండేలా అక్షయ పాత్ర, ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం పల్నాడు బస్టాండ్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల పరిసరాల్లో పచ్చదనం పెంపుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామ న్నారు. పల్నాడు బస్టాండ్ దగ్గరలోని క్యాంటీన్ వద్ద వారం రోజుల్లో ఫ్లోర్ మరమత్తులు పూర్తి చేయాలని ఏఈని ఆదేశించారు. పరిసరాల్లో ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలన్నారు. క్యాంటీన్లకు వస్తున్న పేదవారికి ఎవ్వరికీ ఆహారం అందలేదని ఫిర్యాదు రాకూడదని, అందుకు తగిన విధంగా ఆహారం సరఫరా జరి గేలా అక్షయపాత్ర సిబ్బంది అందించాలన్నారు. ప్రజలు క్యాంటీన్‌లో అందే ఆహా రంపై తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియచేయవచ్చని చెప్పారు.

ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేసిన జేసీ

విశాలాంధ్ర - నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావు పేటలో చౌక ధరల ద్వారా బియ్యం పంపిణీ ఏ విధంగా నడుస్తున్నది అన్నదానిపై జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గానోరే గురువారం బియ్యం పంపిణీ చేస్తున్న వాహనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.రేషన్ బియ్యంస్టాక్ వివరాలు ఏ విధంగా ఉన్నాయని ఎం.యు.డి బియ్యం పంపిణీ దారులతో మాట్లాడారు.బియ్యం పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అనే విషయంపై వాహనం వద్దకు వచ్చిన కార్డుదారులతో మాట్లాడారు. రేషన్ పంపిణీ విషయంలో ఏ విధమైన అక్రమాలు జరిగిన కఠిన చర్యలు చేపడతామని, కేసు నమోదు చేస్తామని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నరసరావు పేట ఆర్డిఓ మధులత, తహశీల్దార్ ఉన్నారు.

మంగళగిరిని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం

- త్వరలోనే ఇళ్ల పట్టాల పంపిణీ
- ప్రముఖ దేవాలయాల తరహాలో లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి
- మంత్రి నారా లోకేష్

విశాలాంధ్ర-మంగళగిరి : కూటమి ప్రభుత్వంలో మంగళగిరిని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి పట్టణం వీజే కాలేజీ వద్ద బైపాస్ సర్వీస్ రోడ్డులో టీటీడీ బోర్డు పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ సన్ ఫ్లవర్ హ్యాండ్ లూమ్స్ షోరూమ్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా షోరూమ్ వద్దకు చేరుకున్న మంత్రి లోకేష్‌కు కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీ సన్ ఫ్లర్ హ్యాండ్ లూమ్స్‌ను రిబ్బన్ కట్ చేసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి చేనేత చీరను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ, చెరువు, కొండ పోరంబోకు, రైల్వే భూముల్లో దశాబ్దాలుగా నివాసముంటున్న వారికి పట్టాల పంపిణీ కసరత్తు ప్రారంభమైంది. మంగళగిరి ప్రజల దశాబ్దాల కల వంద పడకల ఆసుపత్రి. కార్పొరేట్ హాస్పిటల్‌కు ధీటుగా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తామన్నారు. ఇప్పటికే డిజైన్లు ఖరారయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ డీపీఆర్ సిద్ధమైందని, మే నెల నుంచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఏడాదిన్నరలో పూర్తిచేస్తాం. వాటర్ పైప్ లైన్, అండర్ గ్రౌండ్ గ్యాస్, పవర్‌తో పాటు పార్కులు, కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తాం. ఇప్పటికే ఎస్ఎల్ఎన్ పార్కు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రాజధాని అమరావతి నుంచి రోడ్ నెం.13, 15ను మంగళగిరికి అనుసంధానించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ప్రముఖ దేవాలయాల తరహాలో మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానికిదేవి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలి

- 'ఉచిత కిడ్నీ వైద్య శిబిరం'లో డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ శ్రీకాంత్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సైలెంట్ కిల్లర్‌గా పేరుగాంచిన కిడ్నీ సంబంధిత వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ వి.శరత్ చంద్ర, కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ పెంట్యాల శ్రీకాంత్‌లు పేర్కొన్నారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా స్థానిక మంగళ దాస్ నగర్‌లోని కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో ఉచిత కిడ్నీ వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ 'మీ కిడ్నీలు బాగున్నాయా- ముందుగానే గుర్తించండి', 'కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడండి' అనే వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ థీమ్‌తో గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో ఉచిత కిడ్నీ వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే జీఆర్‌బీఎస్, సీరం క్రియాటిన్ కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ పరీక్షలు నిర్వహించి నెఫ్రాలజీ, యూరాలజీ డాక్టర్ల కన్సల్టెన్సీ సేవలను ఉచితంగా అందజేశారు. డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ శ్రీకాంత్‌లు మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే కిడ్నీ సంబంధ వ్యాధులను గుర్తించడం వల్ల క్రానిక్ కిడ్నీ జబ్బుల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని సూచించారు. ప్రతి పది మందిలో ఒకరు దీర్ఘకాలిక కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతుంటే మన దేశంలో 10 లక్షల మందిలో 800 మంది కిడ్నీ జబ్బులతో బాధపడుతు న్నారని తెలిపారు. క్రానిక్ కిడ్నీ జబ్బులతో 150 నుంచి 200 మంది బాధపడుతు న్నట్టు గణాంకాలు చెప్తున్నాయని వారు పేర్కొన్నారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంపులను వంద మందికి పైగా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-నరసరావుపేట: స్థానిక డా.కోడెల శివప్రసాద్ క్రీడా ప్రాంగణం నందు మల్టీ పర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు లు శంఖు స్థాపన చేశారు. ఖేలో ఇండియా పథకంలో భాగంగా రూ.4.50 లక్షలతో నిర్మించనున్న ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ జిల్లాలో క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని ఎంపీ, జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్.ఈ సుబ్బారాయుడు, తహశీల్దార్ వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అమరావతి రోడ్డు గోరంట్లలోని రవి నగర్‌లో ఉన్న శాలివాహన సమన్వయ సంఘం భవనం నందు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ 585వ జయంతి వేడుకలు ఆ సంఘం అధ్యక్షులు రాజవరపు శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ చిత్ర పటానికి వారు పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ సంఘం నాయకులు గుంటూరు నగరం నందు శాలివాహన కులదైవం అయిన కవయిత్రి మొల్లమాంబ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కుల పెద్దలు, సంఘాలు అందరూ సహకరించా లని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ వేడుకల్లో మండేపూడి పురుషోత్తం, రాజవరపు ముహరిరావు, కాజ శ్రీనివాసరావు, నారాయణ, బొల్లాపల్లి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి వెంకటేశ్వర్లు, కానూళ్ళ ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయించాలి : డిఎంహెచ్ఓ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఓ) కార్యాలయంలోని సమావేశ మందిరం నందు 'పిల్లలపై లైంగిక దాడులను నివారించడం'పై డీఈఓలు, ఐసీడీఎస్, చైల్డ్ ప్రొటెక్షన్, ఎంఈఓలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డిజేబుల్ వెల్ఫేర్ విభాగం, ఆర్‌బీఎస్‌కె సిబ్బందికి డిఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎదిగే వయస్సున్న పిల్లలతో తల్లిదండ్రులు కొంత సమయం కేటాయించాలన్నారు. అలాగే స్నేహపూరితవాతావరణంలో వారితో మెలిగినపుడు అన్ని సమస్యలు చర్చించుకోవడం జరుగుతుందని, దీంతో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కార మార్గాలు చెప్పటానికి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీఓటీ ఆర్.సుప్రజ, సైకాలజిస్ట్ విజయకుమార్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయలక్ష్మి, పీడీ ఐసీడీఎస్ తెనాలి, గుంటూరు డిప్యూటీ డీఈఓలు, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రావణ్‌బాబు, ఆర్‌బీఎస్‌కె ప్రోగ్రామ్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.